## ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లు సీజ్ : ఎస్ఐ



**బషీరాబాద్ నవంబరు18,ప్రభాతవార్త :** అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను బషీరాబాద్ పోలీసులు శనివారం తెల్లవారుజామున పట్టుకున్నారు.ఎస్ఐ వేణు గోపాల్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం...మండల పరిధిలోని ఎక్మాయి గ్రామ శివారులో గల కాలువ నుండి అక్రమంగా ఇసుక తరలిస్తున్నారన్న పక్క సమాచారం అందుకున్న పోలీసులు ఇసుక ట్రాక్టర్‌లను స్వాధీనం చేసుకున్నారు.దామర్చెడ్ గ్రామానికి చెందిన శాంత కుమార్,సురేష్,ఇద్దరు వ్యక్తులు తమ ట్రాక్టర్‌లతో అక్రమంగా ఇసుక తరలిస్తుండగా పట్టుకొని రెండు ట్రాక్టర్లను సీజ్ చేసి,ఇద్దరు వ్యక్తులపై కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.



రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్

# వార్త

## కాంగ్రెస్ తుఫాన్‌కు బిఆర్ఎస్ కొట్టుకపోతుంది..!

**- కాంగ్రెస్ పార్టీ ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డి**




ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డి

**ఇబ్రహీంపట్నం, నవంబర్ 18, ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ తుఫాన్‌కు బిఆర్ఎస్ కొట్టుకపోవడం ఖాయమని కాంగ్రెస్ పార్టీ ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డి ధీమా వ్యక్తం చేశారు.ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని తులేకలాన్, ఎలిమినేడు, కప్పపహడ్, తుర్కగూడ, చర్లపటేల్ గూడ తదితర గ్రామల్లో పర్యటించారు.ఈ ప్రచారంలో భాగంగా ఆయా గ్రామల్లో కాంగ్రెస్ పార్టీ అభిమానులు, కార్యకర్తలు, మహిళలు ఘన స్వాగతం పలికారు.ఈ సందర్భంగా ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ...కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖార్గే ప్రకటించి మేనిఫెస్టో 'అభయహస్తం' విడుదల చేయడం శుభసూచికమన్నారు.ఆభయ హస్తంలో ప్రకటించిన 37 ప్రధాన అంశాలను ప్రజలకు వివరించారు.అదేవిదంగా మహిళలకు రూ.500కే వంట గ్యాస్, రూ.2500 ఆర్థిక సహాయం, అదేవిదంగా ఆడబిడ్డ పెళ్ళికి రూ.లక్ష సహాయంతో పాటు తులం బంగారం, రూ.4వేల పెన్షన్, రైతులకు రూ.15వేల రైతు బంధు, రూ.12వేలు రైతు కూలీలకు ఆర్థిక సహాయం వంటి హామీలను ప్రజలకు వివరించారు.కెసిఆర్ ప్రజల ఆకాంక్షను కాలరాశారని పదేళ్ల అవకాశం ఇస్తే ధనిక రాష్ట్రాన్ని దివాళ తీయించి..నమ్ముకున్న ప్రజలకు ద్రోహం చేశారని విమర్శించారు.తెలంగాణలో కాంగ్రెస్ తుఫాన్ రాబోతుందని మార్పు కావాలి..కాంగ్రెస్ రావాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు.ఇందిరమ్మ రాజ్యంతోనే ప్రజల ఆకాంక్షలు నెరవేరుతాయని మల్‌రెడ్డి రంగారెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. కాంగ్రెస్‌ను గెలిపిస్తే సంక్షమ ఫలాలన్ని ప్రతిఒక్కరికి అందుతాయన్నారు. స్థానిక సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానన్నారు.కార్యక్రమంలో జెడ్పిటిసి మహిపాల్, సీనియర్ నాయకులు కొత్తకుర్మ శివకుమార్, గురునాథ్ రెడ్డి, హన్మంత్ రెడ్డి,ఎంపిటిసి అంజనేయిలు, ఉప సర్పంచ్ నరేందర్,మండల పార్టీ అధ్యక్షులు జెడల రవీందర్ రెడ్డి, నాయకులు, కార్యకర్తలు_న్నారు.

**కాంగ్రెస్ పార్టీలో చేరికలు..**

ఇబ్రహీంపట్నం అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా మండల పరిధిలోని తులేకలాన్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డి ప్రచారం నిర్వహించారు. అనంతరం ఆ గ్రామానికి చెందిన యువజన నాయకులు సత్తు శశాంక్ రెడ్డి తన వర్గీయులతో కలిసి మల్‌రెడ్డి రంగారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.ఆయన వెంట టిపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శ చిలుక మధుసూదన్ రెడ్డి, పార్టీ శ్రేణులున్నారు.

## ఓటు హక్కును ఓటర్లందరూ వినియోగించుకోవాలి




ఎదులాబాద్‌లో రా ్యలీ నిర్వహిస్తున్న ఏయూ ఎన్ఎస్ఎస్ వాలీంటర్లు

**ఘట్‌కేసర్, నవంబర్ 18, ప్రభాతవార్త:** ఓటు హక్కు కల్గిన ప్రతిఒక్కరూ ఓటు వేయాలని ఏయూ ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త చెన్నకేశ్ మల్లేశ అన్నారు. ఘట్‌కేసర్ మండలం వెంకటాపూర్‌లోని అనురాగ్ విశ్వవిద్యాలయంకు చెందిన ఎన్ఎస్ఎస్ యూనిట్-4 వాలీంటర్లు శనివారం ఎదులాబాద్ గ్రామంలో ఓటు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈనెల 30వ తేదీన జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో ఓటర్లందరూ తప్పకుండా ఓటు వేయాలని ఆయన సూచించారు. ఎదులాబాద్‌లోని పలు వీధుల్లో నిర్వహించిన అవగాహన, ఓటు వినియోగంపై జరిగిన ర్యాలీని మల్లేశ ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ ఓటు వేయాలంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు.

## పర్యాటక కేంద్రానికి నోచుకోని..

# శామీర్‌పేట పెద్ద చెరువు



-ప్రభుత్వాలు మారుతున్నా తీరు మారని వైనం..

-చెరువు ప్రాంగణంలో విహారయాత్రీకులకు సౌకర్యాలు కల్పించరా..?

-కేటాయించిన 25కోట్లలో..సుమారు 3కోట్ల నిధులు ఖర్చు చేసి నామమాత్రంగా పనులా..?

-మిగతా పెండింగ్ నిధులు విడుదల చేసి అభివృద్ధి పనులు చేపట్టాలి

**శామీర్‌పేట, నవంబరు 18, ప్రభాతవార్త**

శామీర్‌పేట పెద్ద చెరువును పర్యాటక కేంద్రంగ గుర్తించటంలో, అభివృద్ధి చేయటంలోనూ ప్రభుత్వ నిర్లక్ష్యం కొనసాగుతుందని పలువురు వాపోతున్నారు. శామీర్‌పేట పెద్ద చెరువు జిల్లా వ్యాప్తంగ అతిపెద్ద చెరువుగా ఉండి నగరానికి చేరువలో ఉంది. గత 40ఏళ్ల కిందటనే శామీర్‌పేట పెద్ద చెరువును పర్యాటక కేంద్రంగ మారుస్తామని, అభివృద్ధి చేస్తామని నాటి మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ మర్రి చెన్నారెడ్డి చెప్పి శ్రీకారం చుట్టటం జరిగింది. అయితే ఈ పెద్ద చెరువుపై ఓ పదేళ్ల పాటు గార్డెనింగ్, ఫౌంటెన్స్,నల్లాలు, ఆకర్షణీయంగ మార్చటం జరిగిన సంగతి తెలిసిందే. అయితే ఆ తరువాత వచ్చిన పలు ప్రభుత్వాలు మళ్లీ దాన్ని వెనక్కి నెట్టి పెద్ద చెరువు అభివృద్ధిని దశలవారీగ అభివృద్ధి చేయకుండ ప్రతి ఏటా కనుమరుగు చేస్తూ వచ్చాయి. ఈ ప్రభుత్వం కూడ శామీర్‌పేట పెద్ద చెరువును పర్యాటక కేంద్రంగ గుర్తించి అభివృద్ధి చేస్తామన్న హామీ నీటిమూటలుగ మారిందని పలువురు విమర్శలు వ్యక్తం చేస్తున్నారు. శామీర్‌పేట పెద్ద చెరువు 1978లోనే మేడ్చల్ ఎమ్మెల్యేగ, రాష్ట్ర నాటి ముఖ్యమంత్రి స్వర్గీయ డాక్టర్ మర్రి చెన్నారెడ్డి గుర్తించి అభివృద్ధి చేసి పర్యాటక కేంద్రంగ మార్చటానికి కృషి చేయటం జరిగింది. కొన్నేళ్ల పాటు శామీర్‌పేట పెద్ద చెరువు విహారయాత్రీకులకు ఆకర్షణీయంగ ఉండేలా తీర్చిదిద్దటం జరిగింది. ఆ తరువాత వచ్చిన పలు కాంగ్రెస్, తెలుగుదేశం, టిఆర్ఎస్ తెలంగాణ ప్రభుత్వాలు కూడ పట్టించుకోలేదు. ఎంతో మంది ఎమ్మెల్యేలు, మంత్రులుగ పనిచేసిన వారు కూడ శామీర్‌పేట పెద్ద చెరువును అభివృద్ధి చేస్తామనటం తప్ప, ఆచరణకు నోచుకోలేదు. తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తరువాత శామీర్‌పేట పెద్ద చెరువును పర్యాటక కేంద్రంగ చేస్తామని, అభివృద్ధి చేసి విహారయాత్రీకులకు ఆకర్షణీయంగ మారుస్తామని చెప్పటం తప్ప ఆచరణకు నోచుకోలేదు. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గత కొన్నేళ్ల కింద రాష్ట్ర ముఖ్యమంత్రి కెసిఆర్ 25కోట్ల రూపాయలు శామీర్‌పేట పెద్ద చెరువు అభివృద్ధికి,పర్యాటక కేంద్రం పురోభివృద్ధి కోసం నిధులు కేటాయించినప్పటికీ, ఆ నిధుల్లో కేవలం 3కోట్ల రూపాయలు మాత్రమే ఖర్చు చేసి కొంతమేరకు గార్డెన్, బంగారు తెలంగాణ బోర్డు ప్రదర్శన, కుటీరాలు విశ్రాంతి (గుడిసెలు) కొన్ని నిర్మించటం జరిగిందని సమాచారం. ఈ చెరువులో బోట్స్ ఏర్పాటు చేస్తామని చేయలేదని, పర్యాటక కేంద్రంగ అభివృద్ధి చేస్తామని చెప్పి, మిగతా నిధులు ఖర్చుచేయక అభివృద్ధి చేయకుండానే వదిలేశారని ప్రజల నుంచి విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. అయితే శామీర్‌పేట పెద్ద చెరువు గత రెండేళ్ల నుంచి భారీ వర్షాలు కురవటంతో పెద్ద చెరువు నిండి నీటితో కళకళలాడుతూ ఉంటుంది. శామీర్‌పేట పెద్ద చెరువు కట్టమైసమ్మ అమ్మవారి ఆలయం, పెద్ద చెరువు రాజీవ్ రహదారికి పక్కనే ఉండటంతో ప్రజలకు చెరువు ఆకర్షణీయంగ కనిపిస్తున్న సంగతి తెలిసిందే. అయితే శామీర్‌పేట పెద్ద చెరువును పర్యాటక కేంద్రంగ మార్చాలని, మరింత అభివృద్ధి చేయాలని స్థానిక, పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు. సిఎం కెసిఆర్ కూడ శామీర్‌పేట పెద్ద చెరువు పక్కన ఉన్న రాజీవ్‌రహదారిననే నగరం నుంచి ఫాంహౌజ్‌కు రాకపోకలు నిర్వహించటం జరుగుతుంది. ఈ పెద్ద చెరువును పర్యాటక కేంద్రంగ గుర్తించి విహారయాత్రీకులకు, ప్రజలకు మరిన్ని సౌకర్యాలు కల్పించటానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, గతంలో నిధులు మంజూరు చేసి వదిలేసిన నిధులను మళ్లీ కేటాయించి చెరువు ప్రాంగణంలో అభివృద్ధి పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. శామీర్‌పేట పెద్ద చెరువు అభివృద్ధికి నిధులు 25కోట్లు కేటాయించినప్పటికీ ఆ నిధులు కేవలం 3కోట్ల వరకు మాత్రమే అభివృద్ధికి ఖర్చు చేసి మిగతా నిధులు మంజూరు లేక నిధులు అభివృద్ధి పనులు చేపట్టక అసంపూర్తిలో నిలిచిపోయినట్లు స్పష్టం అవుతుంది.

ఎంతో మంది మంత్రులు, ఎమ్మెల్యేలు మారుతున్నా అభివృద్ధి మాత్రం అంతం తగానే ఉంటుందని పలువురు వాపోతున్నారు. శామీర్‌పేట పెద్ద చెరువు రైతాంగంకు సాగు నీటికి, విహారయాత్రీకులకు ఆహ్లాదకరవా తావరణం అందించటానికి దోహదపడుతుంది. శామీర్‌పేట పెద్ద చెరువును మరింత అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని, వచ్చె ప్రభుత్వంలోనైనా పర్యాటక కేంద్రంగ గుర్తించి అభివృద్ధి చేస్తారా అనేది వేచి చూడాల్సిందే మరీ..

## క్వారి గుంతలో శవమై తేలిన యువకుడు



క్వారిగుంతలో తెలిన సొన్నాయిల ఆకాష్ మృతదేహం

**షాబాద్, నవంబర్ 18, ప్రభాతవార్త :** అదృశ్యమైన యువకుడు కార్వి గుంతలో శవమై తెలిన సంఘటన షాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్లితే.... షాబాద్ మండల పరిధిలోని సీతారాంపూర్ గ్రామానికి చెందిన సోన్నాయిల రాజుకు ముగ్గరు కుమారులు, ముగ్గరు కూతుర్లు ఉన్నారు. సోనానయిల ఆకాష్(15) రాజుకు చిన్న కుమారుడు ఆకాష్ షాబాద్‌లో నవజీవన్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్నాడు. గత బుధవారం నవజీవన్ పాఠశాలలో పెరెంట్స్ మీటింగ్ ఉందని ఇంట్లో చెప్పి పాఠశాలకు వెళ్లలేదు. ఆ తర్వాత తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో నాది ఇది చివరి రోజు అని పోస్టు చేశాడు. అప్పటి నుండి ఆకాష్ ఆచూకి కోసం బంధులు, స్నేహితులు తెలిసిన వారి వద్ద వెతికిన ఆచూకి లభించలేదు. గ్రామ సమీపంలోనే పెద్ద కార్వి గుంత వద్ద ఆకాష్ చెప్పులు, తను వెళ్లిన స్కూటి కనపడ్డాయి. అనుమానంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందంచే క్వారీ గుంతలో రెండు రోజులు వెతికిన ఆకాష్ ఆచూకీ లభించలేదు. శనివారం ఉదయం క్వారీ గుంతలో ఆకాష్ మృతదేహం పైకి కనపడింది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# ఎన్నికల కోసం అధికారులు సిద్ధంగా ఉండేలా చర్యలు

-జిల్లాలో వంద శాతం పోలింగ్ జరిగేలా ఓటర్లకు అవగాహన కల్పించాలి

-మేడ్చల్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్

-కలెక్టరేట్‌లో నోడల్ అధికారుల సమావేశం



మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో నోడల్ అధికారులతో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ గౌతమ్,పాల్గొన్న అధికారులు



సమావేశంలో పాల్గొన్న అధికారులు

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి నవంబరు 18, ప్రభాతవార్త**

జిల్లా వ్యాప్తంగ ఎన్నికల కోసం అధికారులు,సిబ్బంది అందరు సిద్ధంగ ఉండేలా తగు చర్యలు తీసుకోవాలని, ప్రశాంతంగ జరగటానికి పకడ్బంధీగ ఏర్పాట్లు చేస్తున్నట్లు, వంద శాతం పోలింగ్ జరిగేలా ఓటర్లకు అవగాహన కల్పించాలని మేడ్చల్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ పేర్కొన్నారు. శనివారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఎన్నికల జిల్లా నోడల్ అధికారులతో ప్రత్యేకంగ సమీక్షా సమావేశంను కలెక్టర్ నిర్వహించారు. దీనిలో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, డిఆర్ఓ హరిప్రియతో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగ కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికల ప్రశాంత వాతావరణంలో జరిగేలా ముందస్తు ప్రణాళికలతో పకడ్బంధీగ ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (ఎంసిసి) ఎన్నికల్లో అక్రమంగ నగదు పంపిణీ, మద్యం, డ్రగ్స్ వంటి అక్రమ కార్యక్రమాలు జరగకుండ ఎస్ఎస్‌టి,ఎఫ్ఎస్‌టి బృందాలు ఇప్పటి వరకు చేసిన కేసులు, పనులకు సంబంధించి పూర్తి వివరాలను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో వ్యయ పరిశీలకుల బృందంలో తీసుకున్న చర్యలపై అధికారులతో ప్రత్యేకంగ కలెక్టర్ చర్చించారు. సి-విజిల్ యాప్ ద్వారా ఇప్పటి వరకు 229ఫిర్యాదులు రాగా వాటికి సంబంధించి సమస్యలు పరిష్కరించినట్లు వివరించారు. కంట్రోల్ రూమ్‌కు వచ్చే ఫిర్యాదులు, చేపడుతున్న చర్యలపు తెలుసుకున్నారు. టోల్‌ఫ్రీనెంబరు 180042520 50కి వచ్చిన ఫిర్యాదులు ఫోన్‌కాల్స్ పూర్తి సమాచారాన్ని సేకరించారు. స్వీప్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగ ఇప్పటివరకు ఓటర్ల అవగాహణ, ఓటు ప్రాముఖ్యత వివరాలు చేపడుతున్నట్లు అధికారులు వివరించగ మరింత అవగాహన కల్పించాల్సిందిగ కలెక్టర్ వారికి సూచించారు. జిల్లాలో పోస్టల్ బ్యాలెట్‌కు సంబంధించి ఇంటింటికి వెళ్లి ఇప్పటి వరకు సేకరించిన వివరాలు తదితర అంశాలపై పలు సూచనలు కలెక్టర్ చేశారు. దీంతో పాటు 1950 టోల్‌ఫ్రీనెంబరుకు 2,419కాల్స్ వచ్చినట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. దీనిలో వచ్చిన ప్రతి ఫిర్యాదును సంబంధిత అధికారి ద్వారా పరిష్కరించేలా అవసరమైన చర్యలు తీసుకోవాల్సిందిగ చెక్‌పోస్టుల వద్ద ఉండే అధికారులు ఎప్పటికపుడు అప్రమత్తంగ ఉండాలని కలెక్టర్ గౌతమ్ ఆదేశించారు. జిల్లాలోని ఆయా పోలింగ్ కేంద్రాల్లో పిఓలు, ఎపిఓలకు శిక్షణ తరగతులు అవసరమైన పోలింగ్ సిబ్బంది గురించి అడిగి తెలుసుకున్నారు. ఫారం-12 కింద 80సంవత్సరాలు పైబడిన పిడబ్ల్యుడి ఓటర్లకు ఇంటి వద్ద నుంచే ఓట్లువేయటానికి ఎన్నికల కమిషన్ అనుమతి ఇవ్వటంతో ముందుగ ఓటు వేసే సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. అన్ని పార్టీల నాయకులకు ముందస్తు సమాచారం ఇవ్వటం జరుగుతుందన్నారు. ఎన్నికల విధులలో పాల్గొనే ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకునే అవకాశంను కల్పించటం జరుగుతుందన్నారు. జిల్లాలో శాసనసభ ఎన్నికల్లో వంద శాతం పోలింగ్ జరిగేలా అన్ని రకాల చర్యలు చేపట్టాలని, ఓటర్లను మరింత అవగాహన పర్చాలని అన్నారు. ఆ తరువాత నోడల్ అధికారులు కొన్ని అంశాలను సమావేశంలో ప్రస్తావించగ అందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ గౌతమ్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, డిఆర్ఓ హరిప్రియ, ఎన్నికల నోడల్ అధికారులు, సంబంధిత అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అన్నింటిలో "ఆదర్శ(ం)"పాఠశాల విద్యా కుసుమాలు..

-రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరుస్తున్న పూడూరు ఆదర్శ పాఠశాల విద్యార్థులు

-విద్యతో పాటు..క్రీడల్లో..సంగీతంలో రాష్ట్ర స్థాయి అవార్డులు

-పిల్లన గ్రోవిలో గిరిజన విద్యార్థినికి రాష్ట్రస్థాయి అవార్డు

-ఉచితంగా పిల్లన గ్రోవి తర్ఫీదునిస్తున్న గణిత ఉపాధ్యాయుడు

**వికారాబాద్,నవంబర్ 18, ప్రభాతవార్త:**

పేరులోనే ఆదర్శం ఉంది. పేరుకు తగ్గట్లుగానే ఆ పాఠశాలలోని విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో, సంగీతంలో రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరుస్తున్నారు. విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరుస్తుండటంతో విద్యార్థుల తల్లిదండ్రులు సైతం ఆనందంతో ఉప్పొంగిపోతున్నారు. విద్యార్థులను ఆ విధంగా తీర్చి దిద్దడం వెనుక పాఠశాల ఉపాధ్యాయుల కృషి దాగిఉంది. చదువు తో పాటు క్రీడలు, సంగీతంలో విద్యార్థులను తీర్చిదిద్దుతున్నారు. విద్యార్థుల్లో దాగిఉన్న ప్రతిభను వెలికితీసి విద్యార్థుల ప్రతిభను రాష్ట్ర వ్యాప్తంగా చాటిచెప్పేందుకు పాఠశాల ఉపాధ్యాయులు ఎంతగానో కృషి చేస్తున్నారు. ఇంతటి అంకిత భావంతో విద్యార్థులను తీర్చి దిద్ది వారి ప్రతిభను అందరికీ తెలిసేలా చేస్తున్న పాఠశాల ఎక్కడో కాదు..మన వికారాబాద్ జిల్లాలోని పూడూరు ఆదర్శపాఠశాలయే. ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఇంతటి ప్రతిభ చూపడంతో అందరి చూపు పూడూరు ఆదర్శ పాఠశాల వైపే ఉంటుంది. అందులో విద్యార్థులకు సీటు లభిస్తే చాలు తమ పిల్లాడు ఏదో ఒక దానిలో ప్రతిభావంతుడు అవుతాడని తల్లిదండ్రులు భావిస్తుంటారు. అందుకే పూడూరు పాఠశాలలో సీటు లభించేందుకు విద్యార్థుల తల్లిదండ్రులు నానా తంటాలు పడతారు. పాఠశాల ప్రిన్సిపల్ మొదలుకుని ఉపాధ్యాయులందరూ ఎంతో అంకిత భావంతో విధులు నిర్వర్తించడంతో అన్నింటా పూడూరు ఆదర్శ పాఠశాల విద్యా కుసుమాలు వికసిస్తాయి. ఏ పరీక్షలు జరిగినా..క్రీడా పోటీలు జరిగినా..పూడూరు ఆదర్శ పాఠశాల విద్యార్థులు అవార్డు దక్కించుకుని తీరుతారు. దీంతో మండల ప్రజలతో పాటు జిల్లా ప్రజలు సైతం పూడూరు ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయ బృందంపై ప్రశంసల జల్లులు కురిపిస్తున్నారు.

**-పిల్లన గ్రోవి వాయించడంలో రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరిచిన గిరిజన విద్యార్థిని...**

ఈ నెల 16న హైదరాబాద్ నగరంలోని సెంటర్ ఫర్ కల్చరల్ రిసోర్సెస్ మరియు ట్రైనింగ్(సీసీఆర్‌టీ) లో సర్వశిక్ష అభియాన్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి సంగీత పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పిల్లనగ్రోవి వాయిద్యంలో పూడూరు ఆదర్శపాఠలలో 9వ తరగతి చదువుతున్న వజ్ర నిర్గోష రాష్ట్ర స్థాయిలో తృతీయ బహుమతి సాదించింది. గతంలో ఇంటర్మీడియట్ ఎంపీసీ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థిని సి.జె.అరుంధతి 2022-23 ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలో 470 మార్కులకు గాను, 466 మార్కులు సాధించి జిల్లా స్థాయిలో మొదటి ర్యాంకు, రాష్ట్ర స్థాయిలో 3వ ర్యాంకు సాధించింది. ఈ మద్యనే ఉమ్మడి రంగారెడ్డి జిల్లా స్థాయి అండర్-14 కబడ్డీ క్రీడా పోటీల్లో 9వ తరగతి చదువుతున్న సంతోష్, చరణ్ లు మొదటి స్థానం సంపాదించి రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారు. ఇలా వరుసగా రాష్ట్రస్థాయిలో పలు రంగాల్లో ఆదర్శ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చడంపై పలువురు ప్రశంసలు కురిపిస్తున్నారు. విద్యార్థిని నిర్గోష వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని వెంకటాపూర్ తాండకు చెందిన నరేంద్ర నాయక్ కూతురు. రాష్ట్ర స్థాయి అవార్డు సాదించడంపై బాలిక తండ్రి, తండా వాసులు సంగీత ఉపాధ్యాయుడిపై ప్రశంసలు కురిపిస్తున్నారు. ఈ విధంగా పూడూరు ఆదర్శ పాఠశాల విద్యార్థులు అన్నింటా ప్రతిభ కనబరిచి అందరి దృష్టిని మరల్చుతున్నారు.

**-ఖాళీ సమయంలో విద్యార్థులకు పిల్లనగ్రోవి వాయిద్యంలో తర్ఫీదునిస్తున్న గణిత ఉపాధ్యాయుడు శ్రీకాంత్...**

ప్రభుత్వ పాఠశాల అంటేనే చదువు సక్కగా చెప్పరు అనే అపవాదు ఉంటుంది. పూడూరు ఆదర్శ పాఠశాలలో మాత్రం అలా కాదు. పాఠ్యాంశాలు బోధించడంతో పాటు క్రీడల్లో...సంగీతంలో విద్యార్థులకు ప్రత్యే తర్ఫీదును ఇస్తుంటారు ఉపాధ్యాయులు. పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడుగా పని చేస్తున్న కె.శ్రీకాంత్‌కు సంగీతంలో సైతం అనుభవం ఉంది. ముఖ్యంగా పిల్లన గ్రోవి వాయిద్యంలో ఆయనకు ఆయనే సాటి అనిపించుకుంటారు. కోయిల రాగాలను సైతం పిల్లన గ్రోవి ద్వారా పలికించే ప్రతిభా శాలి. ఆయన ప్రతిభ గుర్తించిన పాఠశాల ప్రిన్సిపల్ శ్రీదేవి విద్యార్థులకు సైతం ఖాళీ సమయాల్లో తర్ఫీదునివ్వాలని సూచించారు. దీంతో ఆసక్తి ఉన్న విద్యార్థులకు ఖాళీ సమయాల్లో తర్ఫీదునిస్తుంటారు ఉపాధ్యాయుడు శ్రీకాంత్. ఇందులో భాగంగానే 9వ తరగతి చదువుతున్న వజ్ర నిర్గోషకు సైతం తర్ఫీదునిచ్చాడు. రాష్ట్ర స్థాయిలో మూడవ బహుమతి సాధించడంతో..మరికొంత మంది విద్యార్థులను సైతం రాష్ట్ర స్థాయి సంగీత పోటీలలో ప్రతిభ చాటేందుకు తర్ఫీదునిస్తున్నాడు. ఈ సారి జరిగే సంగీత పోటీలలో పిల్లనగ్రోవి వాయిద్యంలో ఖచ్చితంగా తమ పాఠశాల విద్యార్థులు మొదటి బహుమతి సాదిస్తారని ఉపాధ్యాయుడు శ్రీకాంత్ ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఇలా తమ పిల్లలకు ఉచితంగా పిల్లన గ్రోవి వాయిద్యం నేర్పించడంపై విద్యార్థుల తల్లిదండ్రులు ఉపాధ్యాయుడు శ్రీకాంత్ పై ప్రశంసలు కురిపిస్తున్నారు.



పూడూరు ఆదర్శ పాఠశాల

**-విద్యార్థులను ప్రతిభావంతులు తీర్చ దిద్దడమే లక్ష్యం..ః శ్రీదేవి, ప్రిన్సిపల్**

ప్రభుత్వ పాఠశాల అంటేనే అందరికి చులకన భావం ఉంటుంది. దాన్ని రూపుమాపేందుకు పూడూరు ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయ బృంధం శాయశక్తుల కృషి చేస్తుంది. చదువుతో పాటు క్రీడలు, సంగీతం, చిత్రలేఖనం, ఇతర సాంస్కృతిక కార్యక్రమాల్లో సైతం విద్యార్థులను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దేందుకు ఉపాధ్యాయులు ఖాళీ సమయాల్లో తర్ఫీదునిస్తున్నారు. ఇందులో భాగంగా గణిత ఉపాధ్యాయుడు శ్రీకాంత్ సంగీతంలోనూ. ఫిజికల్ డైరెక్టర్ వెంకటేశ్ క్రీడల్లోనే విద్యార్థులను తీర్చిదిద్దుతున్నారు. అందుకు వారికి హృదయపూర్వక అభినంధనలు తెలుపుతున్నాను.



విద్యార్థులకు పిల్లన గ్రోవి లో తర్ఫీదునిస్తున్న గణిత ఉపాధ్యాయుడు శ్రీకాంత్



రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన పూడూరు ఆదర్శ పాఠశాల విద్యార్థులు సంతోష్, చరణ్ లు

## మృతుల కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సహాయం అందజేస్తున్న జడ్పీటిసి జర్పుల దశరథ్‌నాయక్

**కడ్తాల్, నవంబరు 18 ప్రభాతవార్త :** కడ్తాల్ మండల పరిధిలోని ఎక్వాయిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో వారం రోజుల క్రితం అన్నెపు పార్వతమ్మ, దొడ్లపాటి బాలమ్మ మరణించడం జరిగింది. విషయం తెలుసుకున్న గ్రామీణాభివృద్ధి స్టాండింగ్ కమిటి జిల్లా సభ్యులు కడ్తాల్ జడ్పీటిసి జర్పుల దశరథ్‌నాయక్ శనివారం ఎక్వాయిపల్లి చేరుకుని మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులకు జర్పుల రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్టు ద్వారా ఒక్కో కుటుంబానికి 5 వేల రూపాయల చొప్పున రెండు కుటుంబాలకు రూ. 10 వేల ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు డిండి వెంకట్‌రెడ్డి, కడ్తాల్ మండల రైతు సమన్వయ మండల కో ఆర్డినటర్ జోగు వీరయ్య, ఉపసర్పంచ్ జంగం ముత్యాలు, వార్డు సభ్యులు గంటి బిక్షపతి, బిఆర్ఎస్ పార్టీ లీడర్ గోసుల శ్రీశైలం, జాంగీర్ పాల్గొన్నారు.

## మక్తా యాదవ సంఘం సభ్యులు కాంగ్రెస్‌లో చేరిక



ఘట్‌కేసర్ మండలం మక్తాలో కాంగ్రెస్‌పార్టీలో చేరుతున్న యాదవ సంఘం సభ్యులు

**ఘట్‌కేసర్, నవంబర్ 18, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ మండలం చౌదరిగూడ అనుబంధ గ్రామం మక్తాలో యాదవ సంఘం సభ్యులు కాంగ్రెస్‌పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈమేరకు టీపీసీసీ ఉపాధ్యక్షులు తోటకూర వజ్రేశ్‌యాదవ్ సమక్షంలో వారు కాంగ్రెస్‌పార్టీలో చేరగా కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈకార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు కట్ట అంజనేయులు గౌడ్, వార్డుసభ్యురాలు బండ్లగూడెం వాణీగౌడ్, సొసైటీ డైరక్టర్ బాలరాజ్‌యాదవ్, మాజీ ఎంపిటిసి విఘ్నేశ్వర్‌గౌడ్, నాయకులు అమరేందర్‌రెడ్డి, నాగేశ్‌గౌడ్, దావిద్‌రెడ్డి, నర్సింహ్మాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఇంటింటికి తిరిగి ఓటర్‌స్లిప్‌లను సమాచార స్లిప్‌లను పంపిణీ చేయాలి

### జిల్లా ఎన్నికల అధికారి,జిల్లా కలెక్టర్ రాజర్షి షా

**నర్సాపూర్, నవంబర్ 18.ప్రభాతవార్త:** బిఎల్‌వో, బిఎల్‌వో సూపర్ వైజర్‌లు ప్రతి ఇంటింటికి తిరిగి ఓటర్ స్లిప్‌లను, సమాచార స్లిప్‌లను పంపిణీ చేయాలని జిల్లా ఎన్నికల అధికారి,జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. శనివారం నర్సాపూర్ పట్టణంలోని శ్రీరామ్‌నగర్ కాలనీ,జడ్పిహెచ్ఎస్ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల్లోఆయన ఓటర్లకు ఓటర్ల స్లిప్‌లు, సమాచార స్లిప్‌లను అందించారు. ఈసందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి,జిల్లా కలెక్టర్ రాజర్షిషా మాట్లాడుతూ పోలింగ్ రోజుకు కొన్నిరోజులే ఉన్నందున బిఎల్‌వోలు, బిఎల్‌వో సూపర్ వైజర్‌లు ప్రతి ఇంటింటికి తిరిగి వారికి ఓటర్ సమాచార స్లిప్‌లను పంపిణీ చేయాలన్నారు.రోజుకు 200 ఓటర్లకు ఈ సమాచార స్లిప్‌ల ను పంపిణీ చేస్తె త్వరితగతిన పంపిణీ పూర్తవుతుందని అన్నారు.ఓటరు స్లిప్ లతో పాటు ఓటర్ గైడ్, సివిజిల్, కర పత్రాలు ప్రతి ఓటర్‌కు అందించాలని సూచించారు.ఓటరు లేకపోయినట్లైతే వారి కుటుంభ సభ్యులకు మాత్రమే ఇవ్వాలన్నారు.ఓటరు స్లిప్‌లు తీసుకున్నవారి సంతకాలు, వేలిముద్రలు తీసుకోవాలని ఆయన తెలిపారు.సెక్టార్ అధికారులు ఖచ్చితంగా పర్యవేక్షించాలని ఆదేశించారు.బిఎల్‌వోలు, బిఎల్‌వో సూపర్ వైజర్‌లు రాజకీయ పార్టీల భూత్ లేవల్ ఎజెంట్లకు సమాచారం అందించాలన్నారు. ఈకార్యక్రమంలో మున్సిఫల్ కమీషనర్ వెంకట్‌గోపాల్, ఆర్ఐ ఫైజల్, బిఎల్‌వో సూపర్ వైజర్ విజయ లక్ష్మి, బిఎల్‌వో మౌనిక, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

## పోలీస్ కమాండ్ కంట్రోల్ రూం పరిశీలన

**మెదక్ అర్బన్, నవంబర్18 ప్రభాతవార్త :** నూతన జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయాన్ని శనివారం సందర్శించిన మెదక్ జిల్లా పోలీసు పరిశీలకులు సంతోష్ కుమార్ తుకారాంను జిల్లా ఎస్పీ రోహిణి ప్రియదర్శిని పూలమొక్క అందజేసి సాదరంగా ఆహ్వానించారు. పోలీసు ప్రధాన కార్యాలయంలో జిల్లా ఎస్పీ రోహిణి ప్రియదర్శినితో కలిసి జిల్లా కమాండ్ కంట్రోల్ రూంను పరిశీలించారు. ఎస్పీ రోహిణి ప్రియదర్శిని కమాండ్ కంట్రోల్ రూం పనితీరును తెలియజేస్తూ తాము కమాండ్ కంట్రోల్ ద్వారా ఏ విధంగా విధులను నిర్వహిస్తున్నామనే అంశాలను వివరంగా వివరించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా పోలీసు పరిశీలకులు సంతోష్ కుమార్ తుకారాం మాట్లాడుతూ జిల్లా సిబ్బంది వివరాలు అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో పారదర్శకంగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు ఎన్నికల పరిశీలకులుగా తాము వచ్చినట్లు తెలిపారు. గత ఎన్నికల మాదిరిగానే ఈ సారి ఎన్నికల్లో పోలింగ్ శాతం పెరిగే విధంగా ప్రజలు నిర్భయంగా వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకునే విధంగా కృషి చేయాలని సిబ్బందికి తెలిపారు. అలాగే ఎన్నికల్లో అప్రమత్తంగా విధులు నిర్వహించాలని, అలసత్వం చేయకూడదని, ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించాల్సిన బాధ్యత మనపై ఉంటుందని, ఎన్నికల్లో అన్ని అంశాలపై జాగ్రత్తగా వ్యవహరించాల్సి ఉటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీ సీఐ సందీప్‌రెడ్డి, ఎంటీఆర్ఐ నాగేశ్వర్‌రావు, కమాండ్ పాల్గొన్నారు.

## అభ్యర్థుల ఎన్నికల ఖర్చులను విధిగా తెలపాలి

### అభ్యర్థులకు వ్యయ పరిశీలకులు విజయ్ కృష్ణ విలాన్

**జహీరాబాద్, నవంబరు 18, ప్రభాతవార్త:** శాసన సభ ఎన్నికలను పురస్కరించుకుని ఎమ్మెల్యే అభ్యర్థులు నామినేషన్ వేసన నాటి నుంచి ఎప్పటికప్పుడు తమ ఎన్నికల ఖర్చులను రిటర్నింగ్ అధికారి కార్యాలయం రిజిస్టారులో నమోదు చేయాలని ఎన్నికల పరిశీలకులు విజయ్ కృష్ణ విలాన్ అన్నారు. శనివారం పట్టణంలోని ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో ఎమ్మెల్యే అభ్యర్థులు, అభ్యర్థులు పోలింగ్ ఏజంట్లతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ఎన్నికలు ముగిసేంత వరకు అభ్యర్థులు తమ ఖర్చులను విధిగా వివరించాలన్నారు. ఏమైన అభ్యంతరాలు ఉంటే సహాయ వ్యయ పరిశీలనకు వివరించాలన్నారు. సమావేశంలో రిటర్నింగ్ అధికారి కే వెంకారెడ్డి, తహసీల్దార్ ఎస్ రవీందర్, కాంగ్రెస్, బిఆర్ఎస్, బిజెపి, బిఎస్పీ అభ్యర్థుల ఏజంట్లు, ఆయా రాజకీయ పార్టీల అభ్యర్థులు పాల్గొన్నారు.

## అత్యాధునిక సేవల్లో అద్భుతమైన ఫలితాలు

**శామిరుపేట నవంబరు18,ప్రభాతవార్త :** అత్యాధునిక ఐటి,డిజిటల్ మీడియా,ఐటి ఆధారిత సేవల్లో ప్రత్యేకత కలిగిన ప్రముఖ రైల్వే సర్వీస్ ప్రొవైడర్ కంపెనీ క్రెసాండా సొల్యూషన్స్ లిమిటెడ్ 2024 ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో అద్భుతమైన ఫలితాలను ప్రకటించింది.2023 ఆర్థిక సంవత్సరం మొత్తంలో కంపెనీ నికర లాభం 60.8 కోట్లు కాగా,2024 ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలోనే నికర లాభం రూ.5.1 కోట్లకు పెరిగినట్లు వెల్లడించింది.

# దోమల బెడదతో ప్రజల ఇక్కట్లు..పొంచి ఉన్న రోగాలు

## -అధికారుల పర్యవేక్షణ కరవు..చర్యలు శూన్యం -రికార్డుల్లో కాకి లెక్కలు



ఘట్‌కేసర్ బొక్కోనిగూడ ఎరుమల్లెవాగులో పెరిగిన గుర్రపుడెక్క

**ఘట్‌కేసర్, నవంబర్ 18, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ మండలంలో దోమల బెడద తీవ్రరూపం దాల్చింది. దోమల సమస్యలో పలు గ్రామాల ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. సాయంత్రం అయితే చాలు బయట ఉండలేని పరిస్థితి నెలకొందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మూసి కాలుష్యం, పారిశుధ్యం లోపంతో దోమలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. అసలే చలికాలం కావడంతో జనాలకు దోమల బెడద కంటికి నిద్రలేకుండా చేస్తున్నది. మూసీ మురికి నీటితో నిండిన చెరువులు, నారాయణరావుచానల్ పరిసర గ్రామాల్లో సమస్య అధికంగా ఉంది. లక్ష్మీనారాయణ చెరువు, ఎరుమల్లెవాగులో గుర్రపు డెక్క ఆకు పేరుకు పోగా దోమల సంఖ్య పెరిగిపోతుంది. లక్ష్మీనారాయణ చెరువు, నాడెంచెరువు, కుమ్మరికుంట చెరువుల్లో మురికి నీటి కారణంగా దోమల ప్రభావం అధికంగా ఉంది. కాలుష్యపు జలాలతో వరిపంటలు పండిస్తున్న గ్రామాల్లో దోమల తీవ్రత పెరుగుతున్నది. అధికారులకు, ప్రజాప్రతినిధులకు మొర పెట్టుకున్నా దోమల సమస్యపై చర్యలు తీసుకోవడం లేదని పలు గ్రామాల ప్రజలు వాపోతున్నారు. పలు గ్రామా ల్లో గ్రామం చివరన డ్రైనేజీ నీటితో పెద్ద మురికి కుంటలు ఏర్పడి దోమలకు ఆ వాసంగా మారు తుంది. గ్రామా ల్లో పారిశుద్య చర్యలు తీసు కుంటు న్నామని పంచా యతీ సిబ్బంది చెబుతున్నా దో మల సమస్యకు మాత్రం పరిష్కారం దొరకడం లేదని ప్రజలు ఆ వేదన వ్యక్తం చేన్స్తున్నారు. ఫాకింగ్ యంత్రాలు కొన్ని పంచాయతీల్లో ఉన్నప్పటికి నిర్వహణ లేక మూలన పడేశారు. గ్రామాలు, కాలనీల్లో ఫాకింగ్ చేస్తున్నామని గ్రామసభలో చెబుతున్న ఆచరణలో మాత్రం కనిపించడం లేదు. ఘట్‌కేసర్, శివారెడ్డిగూడ, చౌదరిగూడ, సాదత్ఆలీగూడ, మక్తా, ఘణాపూర్, వెంకటాపూర్, తెనుగూడెం, చందుపట్ల గూడ, బొక్కోనిగూడ, లింగాపూర్, ఫకీర్‌టెక్యా, ఎన్ఎఫ్‌సీ నగర్, కొండాపూర్, మర్రిపల్లిగూడ గ్రామాల్లో దోమల బెడద ఎక్కువై జనాలు రోగాల భారిన పడుతున్నారు. ఆయా గ్రామాల్లో మురికినీరు పారుతుండటంతో దోమలు, ఈగలు వృద్ది చెందుతుడగా పందులకు అవాసంగా మారుతుంది.



ఎదులాబాద్‌లో దేవాలయం వద్ద మురికి పారుతున్న దృశ్యం

### ...దోమలతో పొంచి ఉన్న రోగాలు..

అనాఫిలిస్ దోమ కాటుతో మలేరియా, చలి, వణుకుతో కూడిన జ్వరం వస్తుంది. దోమ కాటుతో పలువురు డెంగీ జ్వరం సోకి విషమంగా మారి మరణించిన సందర్భాలు ఉన్నాయి. దోమల విషయంలో తగిన జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచిస్తున్నా గ్రామాల్లో ఏమి చేయలేని పరిస్థితి నెలకొంది. మురుగుగుంతలు, కంపచెట్లు, పిచ్చిమొక్కలు, నీరు నిల్వ ఉండే ప్రదేశాల్లో దోమలు నివాసం ఏర్పర చుకుంటున్నాయి. గుడ్డు లార్వా ప్యూపా వృద్ది చెంది దోమగా మారి ప్రజల రక్తాన్ని పీల్చుతున్నాయి. ఘట్‌కేసర్ మున్సిపల్‌లో గతంలో నీటి కుంటల్లో ఆయిల్ బాల్స్ వేసినప్ప టికి దోమలు తగ్గడం లేదు. ఇకనైనా అధికారులు స్పందించి దోమల సమస్యకు పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు.

# పైసా కొట్టు ..ఫాలోవర్లను పట్టు

**-ఎన్నికల నేపథ్యంలో సామాజిక మాధ్యమాలకు డిమాండ్**
**-డబ్బులిస్తే కంటెంట్‌తో సహా సోషల్‌మీడియాలో పోస్ట్‌లు**
**-ఓటర్లకు చేరువయ్యేందుకు నేతల వినూత్న పోకడలు**




**హైదరాబాద్, నవంబర్ 18,ప్రభాతవార్త:** రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో నాయకుల ప్రచారశైలి కొత్తపుంతలు తొక్కుతోంది. ఆయా పార్టీల నేతలు ఆధునిక ప్రచారానికి ప్రాధాన్యతనిస్తున్నారు. ఎన్నికల ప్రచార సభలకు డబ్బులిస్తే వేల సంఖ్యలో జనం హాజరుకావడం మామూలే..అదే సామాజిక మాధ్యమాలల్లో అనుసరించే వారి (ఫాలోవర్ల)ని సంఖ్య పెంచుకోవాలంటే అప్పటివరకు ఆన్‌లైన్ వైపు కూడా చూడని నేత ఒక్కపోస్టుతో వేలు, లక్షల మందిని చేరుకోవాలంటే వ్యక్తిగత ఖాతా, పేజీ తెరిచి ఫాలోవర్లను పెరిగే వరకు వేచిచూడటం సుదీర్ఘమైన ప్రక్రియ, ఇవేవీ లేకుండా పైసా కొడితే వేలు, లక్షల సంఖ్యలో ఫాలోవరన్లను తెచ్చిపెట్టే విధానం అందుబాటులో ఉంది. ఎన్నికల నేపథ్యంలో లక్షల సంఖ్యలో ఫాలోవర్లు ఉండే సామాజిక మాధ్యమ పేజీలను కొందరు డబ్బులకు అమ్మేస్తున్నారు.ఒక్కో ఫాలోవర్‌కు రూ.3నుంచి 5వేల వరకు ధర నిర్ణయిస్తున్నారు. ఎన్నికల నేపథ్యంలో హైదరా బాద్ నగరంతోపాటు నియోజకవర్గాల్లోనూ వీటికి భలే డిమాండ్ ఉందని సోషల్ మీడియా స్ట్రాటజిస్టులు చెబుతున్నారు.

### ఓటర్లకు చేరువే లక్ష్యం...

ఎన్నికల బరిలో నిలవానుకుంటే అభ్యర్థులు పైచేయి సాధించాలని భావిస్తుంటారు. ఇంటింటికి వెళ్ళి ప్రజా సంబంధాలు పెంచుకోవడం, హోర్డింగులు, ఫ్లెక్సీలతో ప్రకటనలు గుప్పించడం ఒకెత్తు. ఈతరహా ప్రచారంపై రాష్ట్రస్థాయి నేతలే కాదు నియోజవకర్గ స్థాయి నాయకులూ గురిపెట్టారు. ఎక్కువ ప్రజాదారణ పొందిన లక్షల ఫాలోవర్లు ఉండే పేజీలను డబ్బులిచ్చి కొనుగోలు చేస్తున్నారు. తాత్కాలిక సోషల్ స్ట్రాటజిస్టులను నియమించుకుంటున్నారు.

### కాసులిస్తే కంటెంట్ ..

సామాజిక మాధ్యమాల్లో పోస్టులు అందులో ఉండే కంటెంట్ నచ్చితేనే ఎక్కువమంది అనుసరిస్తారు. ఉదాహరణకు కొందరకు ఫేస్‌బుక్, ఇన్‌స్టా, ట్విటర్ ఖాతాపేజీని ప్రారంభిస్తారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, ప్రజలకు చేరువయ్యే పేరుతో ఇవి మొదలువుతాయి. అడ్మిన్లు ఈపేజీలో రాష్ట్ర వ్యాప్తంగా రాజకీయాలకు సంబంధించిన పోస్టులు, నేతల ప్రసంగాల వీడియోలు, కార్టూన్‌లు, మీమ్‌లు నిత్యం పోస్టు చేస్తుంటారు. నెలల వ్యవధిలో ఫాలోవర్ల సంఖ్య లక్షల్లోకి చేరుతుంది. ఫాలోవర్లు బాగా పెరిగాక అడ్మిన్లను తొలగిస్తారు. ఒక్కో ఫాలోవర్‌రూ రూ.3-5చొపుపన ధర నిర్ణయిస్తారు. ఎవరైనా డబ్బులు చెల్లిస్తే ఖాతాను వారి పేర్ల మీదకు మారుస్తారు.

### వ్యూహకర్తలకు ఊహించని గిరాకీ ..

ఎన్నికల నేపథ్యంలో సోషల్ మీడియా స్ట్రాటజిస్టులకు భలే డిమాండ్ పెరిగింది. వీరిని వివిధ పార్టీల అభ్యర్థులు, ఆశావాహులు తాత్కాలిక ప్రాతిపదికన నియమించుకుంటున్నారు. ఎన్నికలకు అనుగుణంగా ఎప్పటికప్పుడు పర్యటనలు, ప్రసంగాలు, నియోజకవర్గ స్థాయిలో ప్రజలను ఆకట్టుకునేలా పోస్టులు చేయడానికి ఉపయోగించుకుంటున్నారు. ఇలా వ్యూహకర్తల్ని అందించేందుకు నగరాల్లో ప్రత్యేక కన్సల్టెన్సీలు ఏర్పాటయ్యాయి.

### ఫాలోకాకున్నా .ప్రకటనలు ప్రత్యక్షం

కొందరు నేతలు సామాజిక మాధ్యమాల్లో సొంతంగా ఖాతాలు తెరిచి ముందుభాగంలో వచ్చేలా ప్రకటనలు ఇస్తున్నారు. నిర్ణీత రుసుముతో ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లో ఈవ్యవస్థ అందుబాటులో ఉంది. యూట్యూబ్ తరహాలో ఈప్రకనలు ఖాతాదారులందరికీ వర్తిస్థాయి. రీల్స్,పోస్టులు చూస్తున్నప్పుడు అభ్యర్థుల ప్రకటనలు విరివిగా వస్తాయి. ఆయా అభ్యర్థుల ఖాతాలను ఫాలో అవ్వకుండా ప్రకనటలు కనిపిస్తాయి.

# వికారాబాద్‌లో ద్విముఖ పోటీ..

## -గెలుపు ధీమాలో బీఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులు.. -ప్రభావం చూపని బీజేపీ, బీఎస్పీ పార్టీలు..

**వికారాబాద్,నవంబర్ 18, ప్రభాతవార్త:** ఈ అసెంబ్లీ ఎన్నికల్లో ఆయా పార్టీల అభ్యర్థులు నిర్వహిస్తున్న ప్రచార హోరు, ఓటరు నాడి బట్టి చూస్తే వికారాబాద్ నియోజకవర్గంలో ద్విముఖ పోటీ ఉన్నట్లు తెలుస్తుంది. ప్రముఖంగా బీఆర్ఎస్ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్, కాంగ్రెస్ అభ్యర్థి, మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్ ల మద్యనే ప్రధాన పోటీ ఉన్నట్లు రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. బీజేపీ, బీఎస్పీ పార్టీల అభ్యర్థులు ఈ ఎన్నికల్లో ప్రభావం చూపడం లేదంటూ పలువురు చర్చించుకుంటున్నారు. 2018 లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మాజీ మంత్రి డాక్టర్ ఎ.చంద్రశేఖర్ స్వతంత్ర అభ్యర్థిగా(ఆల్ ఇండియా పార్వాడ్ బ్లాక్ పార్టీ) ఎన్నికల బరిలో దిగి..అత్యధికంగా కాంగ్రెస్ అభ్యర్థి ఓట్లు చీల్చి కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం ప్రసాద్‌కుమార్ ఓటమి కి కారకుడయ్యాడు. ఈ సారి సైతం అదే తప్పిదం జరుగరాదనే ఉద్దేశంతో కాంగ్రెస్ అధిష్టానం ఆలోచించి బీజేపీ పార్టీలో ఉన్న మాజీ మంత్రి డాక్టర్ ఎ.చంద్రశేఖర్‌ను కాంగ్రెస్ పార్టీలో చేర్చుకుని జహీరాబాద్ అసెంబ్లీ టిక్కెట్టు ఇచ్చి బరిలో దింపారు. దీంతో వికారాబాద్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ వర్సెస్ కాంగ్రెస్ అన్న తీరుగా ఎన్నికల పోలింగ్ సరళి ఉండబోతుందని పలువురు చర్చించుకుంటున్నారు. గతంలో చంద్రశేఖర్ ఓట్లు చీల్చిన మాదిరిగా నైనా బీజేపీ, బీఎస్పీ అభ్యర్థులు లేరని, రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ప్రధాన పార్టీలైన బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు సంబంధించిన అధిష్టాన పెద్దలు అభ్యర్థుల తరఫున వికారాబాద్ నియోజకవర్గంలో సభలు, రోడ్ షోలు నిర్వహించి ప్రచారం చేశారు. ఇందులో భాగంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ సభ, రోడ్ షోలు నిర్వహించగా, కాంగ్రెస్ అభ్యర్థి తరఫున టీపీసీసీ అధ్యక్షులు ఎ.రేవంత్‌రెడ్డి బహిరంగ సభను వికారాబాద్‌లో నిర్వహించారు. బీజేపీ, బీఎస్పీ అభ్యర్థుల తరఫున వికారాబాద్ నియోజకవర్గంలో ఇప్పటివరకు అధిష్టాన పెద్దలతో ఎలాంటి ప్రచార కార్యక్రమాలు నిర్వహించలేరు. కనీసం రోడ్ షోలు సైతం నిర్వహించకపోవడంపై ఈ పార్టీల అభ్యర్థుల ప్రభావం..ప్రధాన పార్టీల అభ్యర్థులపై ఎలాంటి ప్రభావం చూపబోదని విశ్లేషకులు భావిస్తున్నారు. దీంతో వికారాబాద్ నియోజకవర్గంలోని అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్ ల మద్యనే ద్విముఖ పోటీ ఉండబోతుందని పలువురు పేర్కొంటున్నారు.




వికారాబాద్ నియోజకవర్గ ముఖ చిత్రం

# కెటిఆర్ ఏ ముఖం పెట్టుకుని మొయినాబాద్‌కు వచ్చారు

## - కాంగ్రెస్ అభ్యర్థి పామెన భీమ్ భరత్



ఎన్నికల ప్రచారంలో భాగంగా జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న చేవెళ్ల కాంగ్రెస్ అభ్యర్థి పామెన భీమ్ భరత్

**మొయినాబాద్, నవంబర్ 18 ప్రభాతవార్త:** మొయినాబాద్‌కు మంత్రి కెటిఆర్ ఏ ముఖం పెట్టుకుని వచ్చారని చేవెళ్ల కాంగ్రెస్ అభ్యర్థి పామెన భీమ్ భరత్ నిలదీశారు. గతంలో ప్రజల సాక్షిగా 111 జివో రద్దు చేస్తామని చెప్పి ఇప్పుడు ఇదే ప్రజల ముందు జివో రద్దు చేశామని చెప్పడం పూర్తిగా అవాస్తవమని అన్నారు. బిఆర్ఎస్ అభ్యర్థి కాలె యాదయ్యకు మద్దతుగా నిర్వహించిన రోడ్ షోలో మంత్రి కెటిఆర్ అన్న మాటలను భీమ్ భరత్ తీవ్రంగా ఖండించారు. చేవెళ్ల నియోజకవర్గంలో కాంగ్రెస్‌దే గెలుపు అని గ్రహించి పసలేని ఉపన్యాసం ఇచ్చి కెటిఆర్ జారుకున్నారని పేర్కొన్నారు. తనపై అసత్య ఆరోపణలు చేసిన కెటిఆర్‌పై భీమ్‌భరత్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఎమ్మెల్యే కాలె యాదయ్య చేవెళ్ల ప్రజలను ముంచడమే కాకుండా తిరుపతి దేవుడని కూడా మోసం చేసి ఆర్థికంగా స్థిరపడిన దుర్మార్గుడని అన్నారు. ఒక్కసారి కాంగ్రెస్ గెలిచిన వెంటనే ప్రజా పాలన అంటే ఏంటో తాను చూపిస్తానని అన్నారు. తెలంగాణ ఉద్యమంలో పని చేసిన వారిపై ఇప్పటికీ కేసులు ఉన్నాయని, అయితే కెసిఆర్ కుటుంబం మాత్రం ఒక్క కేసు ఎదుర్కొనకుండా విలాసవంతమైన జీవితాన్ని గడుపుతోందని విమర్శించారు. ఏనాడైనా ప్రజల కోసం పోరాడి కాలె యాదయ్య ఒక్కరోజైనా జైలు జీవితం గడిపారా అని ప్రశ్నించారు. ప్రజాస్వామ్యంలో ప్రజల పక్షాన పోరాడిన వారిపై కేసులు బరాబర్ ఉంటాయని అన్నారు.

## బైక్ వీల్‌లో చీరచిక్కుకుని రోడ్డు ప్రమాదం

### మహిళ మృతి

**అల్లాదుర్గం, నవంబరు 18, ప్రభాతవార్త:** ద్విచక్ర వాహనం టైరులో చీర చిక్కుకున్న సంఘటనలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందిన సంఘటన మండలంలోని కాగితంపల్లి గ్రామ శివారులో శనివారం చోటు చేసుకుంది. ఎస్ఐ ప్రవీణ్‌రెడ్డి కథనం ప్రకారం ఇందుకు సంబంధించి పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. నారాయణఖేడ్ మండలం అబ్బెంద గ్రామానికి చెందిన దొంతి తుకారాం తన భార్య నిర్మల, బాబుతో కలిసి ద్విచక్ర వాహనంపై హైద్రాబాద్ నుంచి గ్రామానికి వెళుతున్న క్రమంలో అల్లాదుర్గం మండలం కాగితంపల్లి గ్రామ శివారులో నిర్మల చీర కొంగు ద్విచక్ర వాహనం చక్రంలో చిక్కుకోవడంతో వాహనం బోల్తా పడగా ప్రమాదంలో మహిళ అక్కడికి అక్కడే మృతి చెందిందన్నారు. వాహనం తోలుతున్న భర్త తుకారంకు స్వల్ప గాయాలయ్యాయన్నారు. పోస్టు మార్టం నిమిత్తం నిర్మల మృతదేహానికి పోస్టు మార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ప్రవీణ్‌రెడ్డి పేర్కొన్నారు.

## కొడకండ్లలో డబుల్ బెడ్‌రూం ఇళ్ళు అమ్ముకున్న బిఆర్ఎస్ నేతలు

### ఆందోళనకు దిగిన బాధితులు

**గజ్వేల్, నవంబర్ 18 (ప్రభాతవార్త):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నిరుపేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్ల పథకంలో అవకతవకలు జరిగాయని కొడకండ్ల గ్రామంలో డబుల్ బెడ్‌రూం బాధితులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ మధ్య కాలంలో ప్రభుత్వం ప్రకటించిన సంక్షేమ పథకాలను నిరుపేదలైన వారిని సెలక్షన్ లీస్టులో పొందుపరిచి డబుల్ బెడ్‌రూం ఇళ్ళ సాంక్షన్ వచ్చిన తర్వాత మాకు ఇవ్వకుండా మా గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధి, సీనియర్ నాయకులతో పాటు గ్రామ పార్టీ అధ్యక్షుడు అందరు కలిసి డబుల్ బెడ్‌రూం ఇళ్ళను అమ్ముకున్నారని ఆరోపించారు. దీనికి సంబంధించి అధికారుల దృష్టికి తీసుకెళ్ళినా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని, న్యాయం మాత్రం జరగలేదని వాపోతున్నారు. గ్రామానికి చెందిన ప్రజాప్రతినిధి, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఇలాంటి సంఘటనకు పాల్పడడం దారుణమన్నారు. ప్రజలు ఎన్నుకున్న ప్రతినిధిగా గ్రామంలో నిరుపేదలను గుర్తించాల్సిందిపోయి వారికి డబుల్ బెడ్‌రూంలను వేరేవారికి అమ్ముకోవడం ఎంతవరకు సమంజసమన్నారు. ఈ కార్యక్రమంలో డబుల్ బెడ్‌రూం బాధితులు పులిమామిడి స్వప్న, జకిరాబేగం, ఎడ్ల సత్యమ్మ, ఎరుకల నర్సమ్మ, కళ్యాణి, నరేష్, హజీముద్దీన్, మహ్మద్ అన్వర్, ఎరుకల కిష్టయ్య, నడిగోటు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## తనను గెలిపిస్తే మీతోనే ఉంటా.. అభివృద్ధి చేసి చూపిస్తా

### చేర్యాల ప్రజా ఆశీర్వాద సభలో పల్లారాజేశ్వర్‌రెడ్డి

**చేర్యాల, నవంబర్ 18, ప్రభాతవార్త** తనను గెలిపిస్తే మీవెంటే ఉంటా... అభివృద్ధి చేసి చూపిస్తానని జనగామ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. శనివారం చేర్యాలలో నిర్వహించిన ప్రజా అశీర్వాద సభలో సీఎం కెసిఆర్ పాల్గొనిగా పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ కెసిఆర్‌తో కొట్లాడి నియోజకవర్గానికి కావలసినన్ని నిధులు తెస్తానని ఆయన అన్నారు. కొమ్మూరి తన ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నాడని నేను కూడా ఈ ప్రాంతానికి చెందిన వ్యక్తినే నన్నారు. ప్రజలు బీఆర్ఎస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూడాలని ఎన్నికలు రాగానే కొందరు ప్రజలకు మాయ మాటలు చెప్పిమోసం చేయడానికి వస్తుంటారన్నారు. కాంగ్రెస్, బీజేపిలను నమ్మి ప్రజలు మోసపోవద్దని తెలిపారు. నియోజకవర్గంలో సర్పంచ్‌లు, ఎంపిటీసీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## హుస్నాబాద్ ఎన్నికల బరిలో తండ్రి కోసం తనయ..!

**అక్కన్నపేట, నవంబరు18, ప్రభాతవార్త** హుస్నాబాద్ నియోజకవర్గంలో ఎన్నికల బరిలో నిలిచిన హుస్నాబాద్ శాసనసభ బిఆర్ఎస్ అభ్యర్థి వొడితెల సతీష్ కుమార్ తనయ డాక్టర్ పూజిత తనదైన శైలిలో నియోజకవర్గంలో పర్యటించి తన తండ్రి విజయం కోసం ఓటర్లను ప్రసన్నం చేసుకుంటూ గెలుపు కోసం శ్రమిస్తున్నారు.ఈ నేపధ్యంలో శనివారం డాక్టర్ పూజిత నియోజకవర్గంలోని అక్కన్నపేట మండలంలో పర్యటించి ఇంటింటి ప్రచారా న్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలనుండి అపూర్వ స్పందన లభించింది.ఈ రెండుమార్లు తన నాన్న సతీష్‌కు మార్ ప్రజల సంక్షేమానికి పాటుపడిన తీరును వివరిస్తూనే ఇందుకు ప్రభుత్వం చేపట్టిన సంక్షేమపథకాలతో పాటు అభివృద్ధిని చేసిన తీరును కూలంకషంగా ప్రజలకు తన తండ్రి ఎలాంటి వివాదాలకు తావ్వికుండా ప్రజలందరితో కలిసిమెలిసి ఉంటూ ప్రజల్లో మమేకమైన తీరును ప్రజల ముందు గుర్తుచేసుకున్నారు.ఈ విషయలన్నిటిని ప్రజలు మరిచిపోకుండా మననం చేసుకుంటూ ఈ మారు సార్వ త్రిక ఎన్నికలలో అత్యధిక మెజారిటీతో పాటు విజయాన్ని అందించాలని ఓటర్లను విజ్ఞప్తి చేశారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ మరింత హుస్నాబాద్ నియోజకవ ర్గాన్ని పరుగులు పెట్టించే అవకాశాన్ని సతీష్‌కుమార్‌కు కల్పించాలని ప్రజలను వేడకున్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పూజిత వెంట బిఆర్ఎస్ నాయకులు,పాల్గొన్నారు.

## కాంగ్రెస్ అభ్యర్థి మనోహార్‌రెడ్డికే మా మద్దతు

**- వెల్ఫేర్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వసీం**



మద్దతు ప్రకటించిన వెల్ఫేర్ పార్టీ నేతలు.

**తాండూరు, నవంబరు 18, ప్రభాతవార్త :**
తాండూరులో సమర్థవంతమైన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బుయ్యని మనోహార్‌రెడ్డికే మద్దతు ఇవ్వనున్నట్లు వెల్ఫేర్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహమ్మద్ వసీం అన్నారు. వనివారం తాండూరులోని సమద్ ఫంక్షన్ హాల్‌లో కాంగ్రెస్ అభ్యర్థి మనోహార్‌రెడ్డితో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా 26 స్థానాల్లో పోటీ చేస్తున్న కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థులకు మద్దతు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. తాండూరులో కూడ కాంగ్రెస్ అభ్యర్థి మనోహార్‌రెడ్డి సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ అభ్యర్థి మనోహార్‌రెడ్డి ఎన్నికల్లో మద్దతు ఇచ్చేందుకు ముందుకు వచ్చిన వెల్ఫేర్ పార్టీ ప్రతినిధులకు ఆయన కృజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు అబ్దుల్ రజాక్, ప్రభాకర్‌గౌడ్, నాయకులు అబ్దుల్ రావూఫ్, మసూద్, డబ్ల్యూసీఐ తాండూరు అధ్యక్షులు అలీ, పట్టణ అధ్యక్షులు హబీబ్, మైనార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## చేవెళ్ల గడ్డపై కాంగ్రెస్ గెలుపు ఖాయం



మొయినాబాద్ మండలం చిన్న మంగళారం గ్రామంలో ఇంటింటా ఆరు గ్యారంటీ పథకాల గురించి ప్రచారం చేస్తూ కాంగ్రెస్‌కు ఓట్లేయాలని అభ్యర్థిస్తున్న నాయకులు

**మొయినాబాద్, నవంబర్ 18 ప్రభాతవార్త:** చేవెళ్ల గడ్డపై కాంగ్రెస్ అభ్యర్థి భీమ్ భరత్ గెలుపు ఖాయమని కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు గన్నెపాక నర్సింగరావు అన్నారు. ఆయన ఆధ్వర్యంలో శనివారం ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాల గురించి వివరిస్తూ గ్యారంటీ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వాలు ఇచ్చిన హామీలు కనుమరుగై పోయాయని అన్నారు. కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాల కార్డులు ఇవ్వగానే ప్రజలు కళ్లకు అద్దుకుని కాంగ్రెస్‌కే ఓటు వేస్తామని చెబుతున్నారని అన్నారు. ఈసారి కాంగ్రెస్ గెలుపు ఖాయమని, అధికారం చేపట్టడం కూడా ఖాయమని అన్నారు. ఈ ప్రచారంలో ఆయా గ్రామాల యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మేడ్చల్ జిల్లా ఎన్ఎస్‌యుఐ కార్యదర్శిగా శివాజీనాయక్



నియామకపత్రం అందుకుంటున్న శివాజీనాయక్

**ఘట్‌కేసర్, నవంబర్ 18, ప్రభాతవార్త:**
మేడ్చల్ జిల్లా ఎన్ఎస్‌యుఐ కార్యదర్శిగా నానావత్ శివాజీనాయక్ నియమితులయ్యారు. ఈమేరకు రాష్ట్ర అధ్యక్షులు బల్మూరి వెంకట్ ఆయన నియామకపు ఉత్తర్వులు జారీ చేశారు. ఘట్‌కేసర్ మండలం ఘణాపూర్ అనుబంధ గ్రామం ఫకీర్‌టెక్యాకు చెందిన శివాజీనాయక్ ఎన్ఎస్‌యుఐ మండల అధ్యక్షులుగా కొనసాగుతూ విద్యార్థుల సమస్యలపై చురుకుగా పనిచేస్తుండటంతో జిల్లా కమిటీలో స్థానం కల్పించారు. శివాజీనాయక్ విద్యారంగ సమస్యలపై నిరంతరం పోరాంట చేస్తుండగా రాష్ట్ర అధ్యక్షులు వెంకట్ ఆయనను జిల్లా కార్యదర్శిగా నియమించారని మేడ్చల్ జిల్లా అధ్యక్షులు రాహుల్‌యాదవ్, ఉపాధ్యక్షులు వినయ్‌కుమార్‌లు తెలిపారు. ఈసందర్భంగా వారికి శివాజీనాయక్ కృతజ్ఞతలు తెలియజేస్తూ జిల్లా కార్యదర్శిగా నియమించినందుకు సంతోషంగా ఉందని జిల్లా స్థాయిలో విద్యారంగ సమస్యలపై పోరాటం చేస్తామని శివాజీనాయక్ పేర్కొన్నారు. ఈసందర్భంగా టీపీసీసీ ఉపాధ్యక్షులు వజ్రేశ్‌యాదవ్, మేడ్చల్ బిబ్లాక్ అధ్యక్షులు మహేశ్‌గౌడ్ చేతుల మీదుగా శివాజీనాయక్ నియామక పత్రం అందుకున్నారు.

## బీఆర్ఎస్‌పార్టీలో కొనసాగుతున్న రాజీనామాల పర్వం

**ఘట్‌కేసర్, నవంబర్ 18, ప్రభాతవార్త:**
ఘట్‌కేసర్‌లో పలు యువజన సంఘాల సభ్యులు బీఆర్ఎస్, బిజెపిలకు రాజీనామా చేశారు. మున్సిపల్ పరిధిలోని పలు కాలనీల్లో రాజీనామాల పర్వం కొనసాగుతున్నది. మున్సిపల్ బీఆర్ఎస్ ఎసీ సెల్ ప్రధాన కార్యదర్శి ఇరిటం శ్రీనివాస్‌తో పాటు సర్దార్ పటేల్ యూత్ సభ్యులు ఆపార్టీలకు గుడ్‌బై చెప్పారు. మాజీ సర్పంచ్ అబ్బసాని యాదగిరియాదవ్ ఆధ్వర్యంలో వారు మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు మామిండ్ల ముత్యాలుయాదవ్ సమక్షంలో కాంగ్రెస్‌పార్టీలో చేరారు. ఈకార్యక్రమంలో కౌన్సిలర్లు కడుపొల్ల మల్లేశ్, కుతాడి రవీందర్, మాజీ వార్డుసభ్యులు ఖాజీరహిముద్దిన్, మహిళా కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి సగ్గు అనిత, డిసిసి కార్యదర్శి ఉల్లి అంజనేయులు, యూత్ కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షులు బొక్క సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణలో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయం

**-కాంగ్రెస్ అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డి**

**యాచారం నవంబరు18,ప్రభాతవార్త :**
తెలంగాణ కాంగ్రెస్ జెండా ఎగురబోతుందని కాంగ్రెస్ అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డి దీమా వ్యక్తం చేశారు.శనివారం యాచారం మండల పరిధిలోని చౌదర్‌పల్లి,ధర్మన్నగూడ,చింతుల్ల (తులేకుర్దు) గ్రామంలో అంబేద్కర్ విగ్రహా,బాబు జగ్జీవన్ రావు విగ్రహాలకు మల్‌రెడ్డి రంగారెడ్డి నివాళులర్పించి ప్రచారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే చేయబోయే ఆరు గ్యారంటీల గురించి వివరించారు.ఇబ్రహీంపట్నం నియోజకవర్గ దీర్ఘకాలిక సమస్యలిని నివారించేందుకు కృషి చేస్తానని అన్నారు.యాచారంలో మైనింగ్,ఫార్మసిటి,ధరణి సమస్యలని నివారించేందుకు పోరాటం చేస్తామని పేర్కొన్నారు.ప్రజల చైతన్యవంతమై కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరారు.కాంగ్రెస్ అధికారంలోకి రాగానే నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు,కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



ప్రచారంలో మల్‌రెడ్డి రంగారెడ్డి,మాజీ ఎంపిపి రాచర్ల వెంకటేశ్వర్లు

# కాంగ్రెస్ పార్టీకి ఓటేస్తే మళ్లీ కరెంట్ కష్టాలు తప్పవు

**-ఎమ్మెల్యే కాలె యాదయ్య**

**షాబాద్, నవంబర్ 18, ప్రభాతవార్త :**
కాంగ్రెస్ పార్టీకి ఓటేస్తే మళ్లి కరెంట్ కష్టాలు తప్పవని బీఆర్ఎస్ చేవెళ్ల ఎమ్మెల్యే అభ్యర్థి కాలె యాదయ్య అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం మండల పరిధిలోని బొబ్బిలిగామ,కొమరబండ, గొల్లూర్‌గూడ, కేశవగూడ, ముద్దెంగూడ, చర్లగూడ, ఆస్పల్లిగూడ, ఎల్గొండగూడ, మల్లారెడ్డిగూడ గ్రామాల్లో జడ్పీటీసీ పట్నం అవినాష్‌రెడ్డితో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ....అన్ని వర్గాల ప్రజల కోసం సంక్షేమం కోసం సీఎం కేసీఆర్ అనేక పథకాలు రూపొందించారన్నారు. కాంగ్రెస్, బీజేపీ నాయకుల మాయమాటలకు మోసపోకుండా ప్రజలు ఆలోచించి ఓటు వేయాలని తెలిపారు. కాంగ్రెస్ పార్టీకి అధికారమిస్తే ప్రజల జీవితాల్లో అంధకారమే మిగులుతుందన్నారు. సీఎం కేసీఆర్ 3వ సారి ముఖ్యమంత్రి అయి హ్యాట్రిక్ విజయాన్ని సాధిస్తారన్నారు.తెలంగాణలో కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అందని ఇల్లు లేదన్నారు. తెలంగాణ మరింత అభివృద్ధి చెందాలన్నా, సంక్షేమ ఫలాలు అందాలన్నా మళ్లీ కారు గుర్తుకు ఓటేసి అధికారం ఇవ్వాలన్నారు. కాంగ్రెస్, బీజేపీ వారు ఎన్నిలకప్పుడు వచ్చి చెప్పే మాటలు నమ్మవద్దన్నారు. ఈకార్యక్రమంలో సీనియర్ నాయకులు దేశమల్ల ఆంజనేయులు, పార్టీ మండల అధ్యక్షులు నర్సింగ్‌రావు, ప్రధాన కార్యదర్శి శ్రీరాంరెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మెన్లు నక్క శ్రీనివాస్‌గౌడ్, వెంకటయ్య, రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షులు మధుసూదన్‌రెడ్డి, ఎస్టీసెల్ మండల అధ్యక్షులు గోపాల్‌నాయక్, ఎంపీటీసీ మధుకర్‌రెడ్డి, సర్పంచులు అర్చనసుధాకర్‌రెడ్డి, చంద్రశేఖర్, నర్సింహ్మారెడ్డి, కవిత, జయమ్మసుదర్శన్, పుష్పమ్మ, జంగయ్య, కృష్ణగౌడ్, లింగం, శ్రీనివాస్‌గౌడ్, పీఏసీఎస్ డైరెక్టర్లు నర్సింలు, రాజశేఖర్‌రెడ్డి, మాజీ సర్పంచులు శ్రీనివాస్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, దర్శన్, నాయకులు రాజేందర్‌రెడ్డి, రమేష్‌యాదవ్, యాదయ్య,పాండు, చంద్రశేఖర్‌గుప్తా, ప్రతాప్‌రెడ్డి, శివకుమార్, రామస్వామి తదితరులు ఉన్నారు.



ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

# బిఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి భారీ వలసలు



పెద్దేముల్‌లో కాంగ్రెస్‌లో చేరిన మైనార్టీ నాయకులు

**పెద్దేముల్, నవంబరు 18, ప్రభాతవార్త:** రాష్ట్రంలో రానున్నది ముమ్మాటికే కాంగ్రెస్ సర్కారేనని డీసీసీబి చైర్మెన్,తాండూరు కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. టీపీసీసీ మైనార్టీ కన్వీనర్ యండి.రియాజ్ ఆధ్వర్యంలో పెద్దేముల్ బిఆర్ఎస్‌పార్టీకి చెందిన 30 మంది మైనార్టీ నాయకులు బుయ్యని మనోహర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. వారితో పాటు పెద్దేముల్ ఉపసర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, కోటపల్లి మార్కెట్ కమిటి డైరెక్టర్ వెంకట్‌రెడ్డి తదితరులు కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ హామీల అమలులో బిఆర్ఎస్ ఘోరంగా విఫలమైందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ ప్రధానకార్యదర్శి ధారాసింగ్,మాజీ డీసీసీబి చైర్మెన్ పి.లక్ష్మారెడ్డి, కాంగ్రెస్ జిల్లా మహిళా అధ్యక్షురాలు శోభారాణి, మండల పార్టీ అధ్యక్షుడు కొండపురం గోపాల్, వర్కింగ్ ప్రెసిడెంట్ పెండ్యాల ప్రవీన్‌కుమార్, పెద్దేముల్ సొసైటి డైరెక్టర్ ఎస్.నారాయన్‌రెడ్డి, ఏ బ్లాక్ అధ్యక్షులు లొంక నర్సిములు, మార్కెట్ కమిటి మాజీ వైస్ చైర్మెన్ జితేందర్‌రెడ్డి, న్యాయవాది ఎ ల్లారెడ్డి,మాజీ యంపిటిసి విద్యాసాగర్,సీనియర్ నాయకులు రాంగోపాల్, రాధక్రిష్ణరెడ్డి, డాక్టర్ రమేష్, కోళ్ళ గోపాల్, కోళ్ళ పెంటప్ప, మీనాజ్ ముజీబ్, గంగసారం హర్షవర్ధన్‌రెడ్డి, ద్యావరి శివారెడ్డి,గంగసారం రాజవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఎబిసిడి వర్గీకరణ చేసే వరకు పోరాటం ఆగదు

**-మాదిగలకు రిజర్వేషన్లు కల్పించడంలో నిర్లక్ష్యం**

**-వర్గీకరణకు అనుకూలపార్టీకి మద్దతు : మల్లేశ్**

**ఘట్‌కేసర్, నవంబర్ 18, ప్రభాతవార్త:**
మాదిగల వర్గీకరణ చేసేవరకు పోరాటం ఆగదని ఎంఆర్‌పీఎస్-టిఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మీసాల మల్లేశ్ స్పష్టం చేశారు. ఘట్‌కేసర్ మున్సిపల్ శివారెడ్డిగూడలోని బంధన్ ఫంక్షన్‌హాలులో శనివారం మేడ్చల్ నియోజకవర్గ ఎంఆర్‌పీఎస్ ముఖ్య నాయకుల సమావేశ జరిగింది. ఈసందర్భంగా మల్లేశ్ మాట్లాడుతూ ఎబిసిడి వర్గీకరణ విషయంలో రాజకీయపార్టీలు మాదిగలను మోసం చేస్తున్నాయన్నారు. గత 30 సంవత్సరాలుగా వర్గీకరణ కోసం మాదిగలు పోరాటం చేస్తున్నారని పార్టీలు ఎన్నికల ముందు వాగ్దానాలు చేస్తూ ఓటు రాజకీయాలు చేసి తమను మభ్య పెడుతున్నారని ఆయన వాపోయారు. గతంలో కాంగ్రెస్‌పార్టీ వర్గీకరణకు ఉషామెహ్రా కమిటీని నియమించి వర్గీకరణ బిల్లును అమలు చేయలేదని బిజెపి కూడా ఎన్నికల ముందు 100 రోజుల్లో పార్లమెంటులో బిల్లు ప్రవేశపెడుతామని వాగ్దానం చేసి విస్మరించిందని పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీ మాదిగల వర్గీకరణ చేయాలని అసెంబ్లీలో తీర్మాణం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపించినా అమలు చేయలేదన్నారు. వర్గీకరణకు అనుకూలంగా రాష్ట్ర శాసనసభలో తీర్మాణం ఆమోదింపజేసిన బీఆర్ఎస్‌పార్టీకి తెలంగాణ రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాలో ఎంఆర్‌పీఎస్ మద్దతు ఇస్తుందని మల్లేశ్ పేర్కొన్నారు. ఈసందర్భంగా ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులతో కలిసి చేతులు ఎత్తి ఎన్నికల్లో ఐక్యంగా పని చేస్తామని ప్రకటించారు. ఈసమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పావని జంగయ్యాయాదవ్, వైఎస్ చైర్మన్ మాధవరెడ్డి, మున్సిపల్ బీఆర్ఎస్ అధ్యక్షులు శ్రీనివాస్‌గౌడ్, ఎంఆర్‌పీఎస్ మేడ్చల్ నియోజకవర్గ ఇంచార్జ్ రాంచందర్, మున్సిపల్ ఇంచార్జ్ మన్నె నర్సింగ్‌రావు, సర్పంచులు శివశంకర్, యాదగిరి, ఆర్‌బిఎస్ జిల్లా సభ్యులు మంకయ్య, మాజీ ఎంపిటిసిలు రఘు, నర్సింగ్‌రావు, కౌన్సిలర్లు అంజనేయులు, జహంగీర్, కోఆప్షన్ సభ్యులు శౌకత్‌మియా, మాజీ సర్పంచ్ సాయిలు, నాయకులు హరిశంకర్, రాజేశ్‌కుమార్, వెంకటేశ్, రాందాసు, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.



శివారెడ్డిగూడలో ఎంఆర్‌పీఎస్ సమావేశంలో ఐక్యతను ప్రదర్శిస్తున్న నాయకులు

# అంగరంగ వైభవంగా సీతారాముల కల్యాణం



గాజీపూర్‌లో సీతారాముల కల్యాణంలో పాల్గొన్న దంపతులు

**-సీతారాముల నామస్మరణతో పులకించిన గాజీపూర్**

**పెద్దేముల్, నవంబరు 18, ప్రభాతవార్త:**
పెద్దేముల్ మండలంలోని గాజీపూర్‌లో సీతారాముల కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. శ్రీఆంజనేయస్వామి నూతన దేవాలయ పున:ప్రతిష్టాపనను పురస్కరించుకొని శనివారం నిర్వహించిన సీతారాముల కల్యాణం సందర్భంగా సీతారాముల,శ్రీ ఆంజనేయ నామస్మరణతో గాజీపూర్ ఆలయ పరిసరాలు పులకించిపోయాయి. గత మూడు రోజులుగా కన్నుల పండువగా నిర్వహిస్తున్న వివిధ కార్యక్రమాలతో గాజీపూర్‌లో పండుగ వాతవరణం నెలకొంది. బంధువుల రాకతో ఇండ్లన్ని సందడిగా మారాయి. గ్రామానికి చెందిన రేణుక నరేష్ దంపతులు, సంధ్య హరీశ్వర్‌రెడ్డి దంపతుల అధ్వర్యంలో సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహించారు. కల్యాణం అనంతరం కాంట్రాక్టర్ నరేష్ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాడిపంటలు సమృద్ధిగా పండాలని, పిల్ల పాపలు సంతోషంగా ఉండాలని స్వామి వారికి మొక్కులు మొక్కుకున్నారు.

# స్పందించిన అధికారులు



నీటి ట్యాంకుపై ఉన్న రాతలను తోలగిస్తున్న దృశ్యం

**బంట్వారం,నవంబరు 18, ప్రభాతవార్త;**
శనివారం నాడు వార్తాపత్రికలో వచ్చిన ఎన్నికలు దగ్గర పడుతున్న - తొలగని గోడ పై రాతలు అనే శీర్షికతో ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు మండల పరిధిలోని తొరుమామిడి గ్రామంలో పోలింగ్ బూత్ ముందున్న డబ్బాపై ఆర్ఎస్‌పి, బీఎస్పికి సంబంధించిన ఫోటోల ు సున్నం వేసి తొలగించారు. అదేవిధంగా ఉర్దూ మీడి యం పాఠశాల ముందు ఉన్న నీటి ట్యాంకు పై కమలం గుర్తును చెరిపేశారు ఇదే కాక మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న గోడ రాతలను పూర్తిగా తొలగించినట్లు అధికారులు తెలియజేశారు. అధికారులు స్పందించి రాతల ు తీసేదం పట్ల వివిధ పార్టీలకు చెందిన నాయకులు కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



గోడపై ఉన్న రాతలను తోలగిస్తున్న దృశ్యం

## సాదాసీదగా సాగిన సర్వసభ్య సమావేశం



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి

**కొత్తూర్, నవంబర్ 18, ప్రభాతవార్త :**
కొత్తూర్ మండల కేంద్రంలో శనివారం మండల పరిషత్ కార్యాలయంలో కొత్తూర్ మండలం ఎంపీపీ పిన్నింటి మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ.... ప్రతి 90రోజులకు జరిగే సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహించడం జరిగిందన్నారు. అసెంబ్లీ ఎన్నికలు ఉన్నందున ఎలాంటి హామీలు ఇవ్వకుండా ప్రజాసమస్యలపై నిరంతరం కృషి చేయాలని అధికారులకు సూచించారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో శరత్‌చంద్ర బాబు, ఏఈవో గోపాల్,ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, ఎంపీటీసీలు ప్రసన్నలతనాగారాజుచారి, దేశాల అంజమ్మ, పాత్లావత్ డాకి, సర్పంచ్ వసుందరమ్మ, రవినాయక్,సంతోష్‌నాయక్, కోఆప్షన్ సభ్యులు విజయ్‌పాల్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## ఆటో బైక్ ఢీ...నలుగురికి తీవ్ర గాయలు

**ధారూర్ నవంబరు18,ప్రభాతవార్త :** ఆటో బైకు ఢీకొన్న సంఘటన ధారూర్ మండల కేంద్రంలోని పెట్రోల్ పంపు వద్ద చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం...మదనంతపూర్ తండాకు చెందిన మహిళలు ఆటోలు ధారూర్ మండల కేంద్రంలోని అంగడికి వస్తున్నారు. మండల కేంద్రంలోని పెట్రోల్ బంకు వద్ద రాగానే పెట్రోలు వేసుకొని రోడ్డుపైకి వస్తున్న బైకును ఆటో ఢీ కొట్టింది.ఈ ప్రమాదంలో నలుగురికి తీవ్రగాయలు అయ్యాయి.చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.ఈ విషయంపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

## పల్లె పల్లెలో కాంగ్రెస్‌కు బ్రహ్మారథం



ఎన్నికల ప్రచారంలో భాగంగా శంకర్‌పల్లి మండలంలోని పలు చోట్ల సభల్లో పాల్గొని ప్రసంగిస్తున్న చేవెళ్ల కాంగ్రెస్ అభ్యర్థి భీమ్ భరత్

**శంకర్‌పల్లి, నవంబర్ 18 ప్రభాతవార్త:**
నిరుపేదలకు సంక్షేమ పథకాలు అందాలంటే కాంగ్రెస్ ప్రభుత్వం రావాలని చేవెళ్ల కాంగ్రెస్ అభ్యర్థి భీమ్ భరత్ అన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి అధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. శనివారం ఎన్నికల ప్రచారంలో భాగంగా శంకర్‌పల్లి మండలంలోని శేరిగూడ, కొండకల్, కొండకల్ తాండా, మోకిలా తాండా, మోకిల, పిల్లిగుండ్ల, గోపులారం, మహారాజ్‌పేట్ తదితర గ్రామాల్లో ఏర్పాటు చేసిన సమావేశంలో భరత్ మాట్లాడుతూ తెలంగాణలో కాంగ్రెస్ పార్టీకి ఆదరణ పెరిగిందని అన్నారు. రాష్ట్రాన్ని రాక్షసుల బారి నుంచి కాపాడేందుకు కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి సెక్రటరీ ఉదయ్ మోహన్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు జనార్ధన్‌రెడ్డి, కొండకల్ సర్పంచ్ లావణ్య కాశీనాథ్, మోకిల సర్పంచ్ సుమిత్ర మోహన్‌రెడ్డి, నాయకులు మైలారం శ్రీనివాస్, రవీందర్‌రెడ్డి, అంజిరెడ్డి, వీరారెడ్డి, అనిల్, రాజశేఖర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

## కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు పదవి



ఎన్ఎస్‌యుఐ శంకర్‌పల్లి మండల ఉపాధ్యక్షుడిగా హర్షవర్ధన్‌రెడ్డిని నియమిస్తూ ఆ నియామక పత్రం అందజేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి భీమ్ భరత్

**శంకర్‌పల్లి, నవంబర్ 18 ప్రభాతవార్త:**
కాంగ్రెస్ పార్టీలో ప్రతి కార్యకర్తకు ఉన్నత పదువులు వస్తాయని, యువత రాజకీయాల్లోకి రావాలని కాంగ్రెస్ అభ్యర్థి భీమ్ భరత్ అన్నారు. ఎన్ఎస్‌యుఐ శంకర్‌పల్లి మండల ఉపాధ్యక్షుడిగా హర్షవర్ధన్‌రెడ్డిని చేవెళ్ల నియోజకవర్గం ఎన్ఎస్‌యుఐ అధ్యక్షుడు మధు శనివారం నియమించారు. ఈ నియామక పత్రాన్ని భీమ్ భరత్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, అందరం కలిసికట్టుగా పని చేసి కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకు వస్తామని తెలిపారు.

## బీఆర్ఎస్‌కి సహకార సంఘం చైర్మన్ రాంరెడ్డి రాజీనామా

**ఘట్‌కేసర్, నవంబర్ 18, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ రైతు సేవా సహకార సంఘం చైర్మన్ సింగిరెడ్డి రాంరెడ్డి అధికారపార్టీకి గుడ్‌బై చెప్పారు. ఈమేరకు బీఆర్ఎస్‌పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసినట్లు శనివారం ఆయన విలేకరులకు తెలియజేశారు. ఘట్‌కేసర్ మున్సిపల్ పార్టీ అధ్యక్షులు బండారి శ్రీనివాస్‌గౌడ్‌కు తన రాజీనామా పత్రం అందజేసినట్లు చెప్పారు. వ్యక్తిగత కారణాలతో బీఆర్ఎస్ పార్టీ నుంచి వైదొలుగుతున్నట్లు ఆయన తెలిపారు. తన మిత్రులు,శ్రేయోభిలాషులు, అనుచరులతో చర్చించి అందరి అభి ప్రాయం మేరకు తన కార్యాచరణను ప్రకటిస్తానని రాంరెడ్డి తెలిపారు.బీఆర్ఎస్‌పార్టీలో తనకు సహకరించిన ప్రజాప్రతినిధులు, నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

## కేవీలో విద్యార్థులకు వైద్య పరీక్షలు



ఎన్ఎఫ్‌సీనగర్ కేవీలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

**ఘట్‌కేసర్, నవంబర్ 18, ప్రభాతవార్త:**
ఘట్‌కేసర్ మున్సిపల్ ఎన్ఎఫ్‌సీనగర్ కేంద్రీయ విద్యాలయలో శనివారం ఉచిత వైద్య శిభిరం నిర్వహించారు. వెంకటాపూర్ నీలిమ ఆసుపత్రి ఆధ్వర్యంలో కేవీలో 593 మంది విద్యార్థులకు సాధారణ వైద్య పరీక్షలు చేశారు. ఈసందర్భంగా వైద్యులు, నర్సులు విద్యార్థులకు రక్త నమునాలు సేకరించి రిపోర్ట్‌ను బట్టి అవసరమైన ఆరోగ్య సూచనలు చేశారు. విద్యార్థులు చదువుతో పాటు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని ప్రతిరోజు వ్యాయామం చేయాలని పేర్కొన్నారు. నీలిమ ఆసుపత్రి ద్వారా ప్రజలకు ఉచితంగా అవసరమైతే రాయితీపై వైద్య సేవలు అందిస్తున్నామని సద్వినియోగం చేసుకోవాలని ఆసుపత్రి సీఓఓ ఎస్.నీలిమ తెలిపారు.

## అమరవీరుడు జోగేంద్రకుమార్‌కు నివాళులు



దోమలో అమరవీర జవాన్‌కు నివాళులర్పిస్తున్న దృశ్యం

**దోమ.నవంబర్ 18 ప్రభాతవార్త :**
భారతదేశం రక్షణ కోసం పనిచేస్తున్న జవాన్లపై దాడి చేయడం పిరికిపంద చర్య అని రిటైర్డ్ ఆర్మి జవాన్ గురునాథ్‌రెడ్డి,లింగయ్యముదిరాజ్ అన్నారు. శనివారం నాడు దోమ మండల కేంద్రంలో అమరుడైన జోగేంద్రకుమార్ జవాన్ పోటొకు కు నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమరుడైన జవాన్ జోగేంద్రకుమార్ చత్తిస్‌గడ్ రాష్ట్రములో గరియాబాద్ జిల్లా బడేగోబ్ర పోలింగ్‌బూత్‌లో శుక్రవారం నాడు ఎన్నికల విదుల్లో పాల్గొంటున్నట్లు తెలిపారు.ఐటిబిపి బలగానికి చెందిన జవాన్ జోగేంద్రకుమార్ ఎన్నికలకు వెళ్ళుతుంగా నక్సలైట్ పెట్టిన బాంబు పేళుల్లల్లో హతమైనట్లు వారి ఆత్మకు శాంతి కలుగాలని కోరారు.దోమ మండల రైతు సంఘం అధ్యక్షులు బి.లక్ష్మయ్య మాట్లాడుతూ ...దేశరక్షణ కోసం పని చేస్తున్న జవాన్లకు వారి కుటుంబాలను ఆదుకునేందుకు ప్రభుత్వాలు పూర్తి స్తాయిలోరక్షణ, ఆర్థిక సహాయం కల్పించాలని అన్నారు. ఈలాంటి చర్యలను ప్రతి ఒక్కరు ఖండించాలని,అమరులైనజవాన్లకోసం వారి ఆత్మశాంతి నివాళులు అర్పించుట కోసం అందరు ముందుకు రావాలని కోరారు.అనంతరంఅమరులైన జవాను జోగేంద్రకుమార్‌కు కోవ్వోత్తులతో నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్‌గోపాల్‌గౌడ్,గ్రామస్తులు అంజిబాబు, ఖాజపాషా,బోస్ ,గౌస్, రఫీక్, అంజి,వెంకటయ్య,యువకులు విద్యార్థులు పాల్గోన్నారు.



చేవెళ్ల కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పామెన భీంభరత్ సమక్షంలో చేవెళ్ల గ్రామానికి చేందిన తలారి వెంకటేష్ అద్వర్యంలో సుమారు 50 మంది యువకులు కాంగ్రేస్ పార్టీలో చేరారు (చేవెళ్ల ప్రభాతవార్త)

## బీఆర్ఎస్ పార్టీలో చేరిన మూడిండ్ల దేవదాస్



ఎంపీ రంజిత్‌రెడ్డి అధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నుండి బీఆర్ఎస్ పార్టీలో చేరిన మూడిండ్ల దేవదాస్

**కోట్‌పల్లి, నవంబరు 18, ప్రభాతవార్త;**
కోట్‌పల్లి మండల పరిధిలోని ఎన్నారం గ్రామంలో శనివారం నాడు మాజీ కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులు మూడిండ్ల దేవదాస్. చేవెళ్ళ ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి పిలుపు మేరకు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. స్థానిక ఎమ్మెల్యే మెతుకు అనంద్ రాజకీయ కార్యకలాపాలు, నిస్వార్థ సేవకు నిత్యం ప్రజల కొరకు పనిచేస్తున్న నాయకుడు కేవలం ఆనంద్ అని మాత్రమే అని గమనించి ఇక మీదట బీఆర్ఎస్ పార్టీకి కలిసి పనిచేస్తామన్నారు. ఈకార్యక్రమంలో సిరిపూరం సర్పంచ్ మల్లయ్య, కోట్‌పల్లి ఎంపీపీ, శ్రీనివాస్‌రెడ్డి, మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు అనిల్, మాజీ మార్కెట్ వైస్ చైర్మన్ దశరథ్‌గౌడ్. మండల సహకార సంఘం చైర్మన్ రాంచెంద్రరెడ్డి, మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు వెంకటేష్‌యాదవ్, నాయకులు యాకుబ్. కొండల్ రెడ్డి, జిన్నారం ఎంపీటీసీ బందయ్య, ఎన్నారం మాజీ ఎంపీటీసీ లక్ష్మణ్, కావాలి రవీందర్, అనిల్, కుమార్, రాంచెందర్, బాలేష్ మండల నాయకులు తదితరులు పాల్గోన్నారు.

## కాంగ్రెస్‌లోకి భారీ చేరికలు



మంగళ్ పల్లి పటేల్ గూడలో కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న యువకులు

**ఆదిభట్ల నవంబరు18, ప్రభాతవార్త :**
ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ఆదిభట్ల మున్సిపాలిటీల్లో గల ఎంపి పటేల్ గూడ గ్రామంలో తెలుగుదేశం పార్టీకి సంబంధించిన దాదాపు 150మంది కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా రంగారెడ్డి మాట్లాడుతూ...కాంగ్రెస్ పార్టీలో వీరందరూ చేరికతో మరింత బలపడిందని కాంగ్రెస్ పార్టీ తప్పకుండా తమ జెండాని ఇబ్రహీంపట్నంలో ఎగరవేస్తుందని దీమా వ్యక్తం చేశారు. గత 15 సంవత్సరాలుగా ఇబ్రహీంపట్నంలో ఎమ్మెల్యేగా ఉన్న మంచిరెడ్డి కిషన్ రెడ్డి ప్రజలను గాలికి వదిలేసి వేల కోట్లు సంపాదించుకున్నారని అన్నారు. ఆదిభట్ల మున్సిపాలిటీలో ఎక్కడ చూసిన గుంతలు రోడ్డు ఉన్నాయని, చదువుకున్న యువకులందరూ నిరుద్యోగులుగా మిగిలిపోయారని వాపోయారు. కెసిఆర్ ప్రభుత్వం ఉద్యోగ ప్రకటనలు ఇవ్వకుండా యువకులను మోసం చేస్తుందని యువకులందరూ గమనించాల్సిందిగా కోరారు. మనందరం కలిసి పార్టీని విజయం వైపు తీసుకెళ్లాలని సూచించారు.

## గుండెపోటుతో ఎంపిఓ పాండునాయక్ మృతి



నివాళులర్పిస్తున్న ఎంపిడిఓ వెంకన్నగౌడ్, సిబ్బంది.

**బొంరాస్‌పేట్, నవంబర్18, ప్రభాతవార్త ః**
బొంరాస్‌పేట్ మండల పంచాయతీ అధికారిగా విధులు నిర్వహిస్తున్న ఎంపిఓ పాండునాయక్ శనివారం ఉదయం 5గంటలకు గుండెపోటుతో మృతి చెందడం జరిగింది. మండల పరిషత్ కార్యాలయం అవరణలో ఇంచార్జ్ ఎంపిడిఓ వెంకన్నగౌడ్, కార్యాలయ సిబ్బంది అయన చిత్రపటంకు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూఎంపిఓ గుండెపోటుతో మృతి చెందడం చాలా బాధకరం, అయన ఆత్మకు శాంతి చేకురాలని వారు కోరారు. 2019లో షాద్‌నగర్ నుండి ఎంపిఓగా పదోన్నతిపై బొంరాస్‌పేట్ మండలంకు రావడం జరిగిందని అయన ఇంచార్జ్ ఎంపిడిఓగా కూడా విధులు నిర్వహించడం జరిగిందన్నారు. అయన మృతి పట్ల మండలంలోని ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, తీవ్రదిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

## ప్రపంచకప్‌లో టీం ఇండియా విజయం సాధించాలి




ఇండియా ఆకారంలో కూర్చున్న విద్యార్థులు

**బొంరాస్‌పేట్, నవంబర్18, ప్రభాతవార్త ః**
ఆదివారం జరుగబోయే క్రికెట్ ప్రపంచకప్‌లో ఇండియా ఘన విజయం సాధించాలని తుంకిమెట్లలోని శ్రీ విద్యాజ్యోతి పాఠశాల విద్యార్థులుఇండియా ఆకారంలో కూర్చోని టీం ఇండియాకు శుభాకాంక్షలు తెలియజెశారు. ఈ కార్యక్రమంలో కరస్పడెంట్ శేఖర్, ఉపాధ్యాయులు కుర్మయ్య, లలిత, మాధవి, అర్చన, శ్రావణి, జ్యోతి, అలివేలు, విద్యార్థులు పాల్గోన్నారు.

## అభివృద్ధి చేయని బీఆర్ఎస్ పార్టీ మనకొద్దు

**- కాంగ్రెస్ రాష్ట్ర మైనార్టీ ప్రధాన కార్యదర్శి వాహిద్‌మియా**

**కోట్‌పల్లి, నవంబరు 18, ప్రభాతవార్త;** వికారాబాద్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ ఎలాంటి అభివృద్ధి చేయలేదని అలాంటి బీఆర్ఎస్ పార్టీకి మనకోద్దు అని అభివృద్ధి పనులు చేసే కాంగ్రెస్ పార్టీకే ఓటు వేసి గెలిపించాలని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ మైనార్టీ ప్రధాన కార్యదర్శి వాహిద్‌మియా అన్నారు. శనివారం నాడు కోట్‌పల్లి మండల పరిధిలోని రాంపూర్ గ్రామంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇంటింటికి వెళ్ళి కాంగ్రెస్ పార్టీ ప్రవేశ పెట్టిన ఆరు గ్యారెంటీ పథకాలపై ప్రజలకు వివరించారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ సర్పంచుల సంఘం అధ్యక్షులు ప్రభాకర్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, మాధవ్, బందయ్య, శశికుమార్, లవకుమార్, ఖదీర్, పరీధ్, మాజీ ఉప సర్పంచు హన్మంతురెడ్డి, సుభాన్‌రెడ్డి, మధుసుధన్‌రెడ్డి, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గోన్నారు.



రాంపూర్ గ్రామంలో కాంగ్రెస్ గ్యారెంటీల గురించి ప్రజలకు వివరిస్తున్న రాష్ట్ర కాంగ్రెస్ మైనార్టీ ప్రధాన కార్యదర్శి వాహిద్‌మియా

## ఏతులు చెపుతున్న కాంగ్రెస్ పార్టీని ఎల్లలు దాటి ఎల్లగొడుదాం : ఎమ్మెల్యే మెతుకు ఆనంద్

**కోట్‌పల్లి నవంబరు 18, ప్రభాతవార్త;**
గత పాలనలో కాంగ్రెస్ పార్టీ రైతులను యెతలు వెట్టి నేడు ఏతులు చెపుతున్న కాంగ్రెస్ పార్టీని ఎల్లలు దాటి ఎల్లగొడుదామని వికారాబాద్ బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మెతుకు అనంద్ అన్నారు. శనివారం నాడు మోమిన్‌పేట్ మండలంలోని కేసారం, ఇజ్రా చిట్టంపల్లి, సయ్యద్ ల్లీపూర్ గ్రామాలల్లో ఎన్నికల ప్రచారంలో భాగంగా అయన పాల్గోన్ని మాట్లాడారు. కష్టాలు వస్తే దేవుళ్ళను గుర్తించుకుంటాం కానీ తెలంగాణలో ముఖ్యమంత్రి కేసీఆర్ కష్టం వచ్చిన ప్రతి సందర్భంలో ఒక సంక్షేమ పథకాన్ని అందించి కష్టాలో తోడుంటున్న కేసీఆర్ సర్కార్‌ను మరోసారి దీవించాలన్నారు. గత పాలనలో కాంగ్రెస్ పార్టీ చేసింది ఏమిలేదని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వచ్చిన తరువాత ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టారన్నారు, వికారాబాద్ నియోజక వర్గంలో బీఆర్ఎస్ పార్టీ జెండా ఎగురువ వేయడం ఖాయమన్నారు. గత పానలో కాంగ్రెస్ పార్టీ పింఛన్లు రూ, 200, వందలు ఇవ్వడం జరిగిందని ఇప్పుడు బీఆర్ఎస్ పాలనలో రూ, 3 వేలు ఇవ్వడం జరుగుతుందన్నారు, ఈ ఎన్నికలో మొదటి సంఖ్యలో ఉన్న కారుగుర్తుకు ఓటు వేసి భారీ మోజార్టీతో గెలిపించాలని ఓటర్లు కోరారు. ఈకార్యక్రమంలో కేసారం సర్పంచు నర్సిములు, మాజీ సర్పంచు అనంతయ్య, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గోన్నారు.



ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న వికారాబాద్ బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మెతుకు ఆనంద్

# తాండూరులో కొనసాగుతున్న హస్తం హవా .!

**- తాండూరు వనరులను దోచుకుంటున్న ఫైలెట్**
**- కాంగ్రెస్ అభ్యర్థి బుయ్యని మనోహార్‌రెడ్డి**



తాండూరులో ప్రచారం చేస్తున్న మనోహార్‌రెడ్డి.

**తాండూరు, నవంబరు 18, ప్రభాతవార్త :**
వికారాబాద్ జిల్లా తాండూరులో హస్తం హవా కొనసాగుతుంది. కాంగ్రెస్ ప్రవేశ పెట్టిన ఆరు గ్యారెంటీ పథకాలపై విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రచారానికి అడుగడుగా ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. శనివారం తాండూరు మున్సిపల్ పరిధిలో కాంగ్రెస్ అభ్యర్థి బుయ్యని మనోహార్‌రెడ్డి ఎన్నికల ప్రచారం జోరుగా కొనసాగింది. పట్టణంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి భారీ ప్రచార ర్యాలీ నిర్వహించారు. ప్రజలకు అభివాదం చేస్తూ.. చేతి గుర్తుకు ఓటు వేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. పట్టణంలోని సాయిపూర్ తాతగుడి నుండి ప్రారంభించిన ర్యాలీ యాదిరెడ్డి చౌక్, అంబేద్కర్ చౌక్, ఐబీ రోడ్ మీదుగా డిఎస్పీ కార్యలయం, సమద్ ఫంక్షన్ హాల్ వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా గడప గడపకు నాయకులతో కలిసి తిరుగుతూ.. కాంగ్రెస్ అందిస్తున్న ప్రజా సంక్షేమ పథకాలపై, కాంగ్రెస్ ప్రవేశ పెట్టిన ఆరు గ్యారెంటీ స్కీములపైప్రజలకు అవగాహన కల్పించారు. రోడ్డు వెంబడి ఉన్న కిరాణ, పాన్‌షాప్, హోటల్ నిర్వహకులను స్వయంగా పలకరిస్తూ వారికి హస్తం గుర్తుకు ఓటువేయాలని కోరారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ అభ్యర్థి మనోహార్‌రెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం చేస్తున్న అవినీతి పాలనపై మండిపడ్డారు. తాండూరు ప్రాంతంలో ఉన్న విలువైన వనరులను బీఆర్ఎస్ నాయకులు దోచుకుంటున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో కేవలం సీఎం కేసీఆర్ కుటుంబానికి, తాండూరు నియోజకవర్గంలో రోహిత్‌రెడ్డి కుటుంబానికి మాత్రమే లాభం జరగిందన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడం ఖాయమని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని తాండూరులో అరాచక పాలనకు చరమగీతం పాడుదామని అన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు సునితాసంపత్, మాజీ మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ పట్లోళ్ల రత్నమాల, కౌన్సిలర్ నీరజా, అబ్దుల్ రజాక్, సీనియర్ నాయకులు అబ్దుల్ రావూఫ్, బాల్‌రెడ్డి, మసూద్, బంటు వేణు, రాష్ట్ర నాయకురాలు సుజాత, పట్టణ అధ్యక్షులు హబీబ్, మాజీ కౌన్సిలర్లు సోఫియా బేగం, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు సంతోష్, మహిళా నాయకురాలు మాధవి తదితరులు పాల్గొన్నారు.

## మన భవిష్యత్తు మన చేతుల్లోనే ఉంది : మాజీ మంత్రి ప్రసాద్‌కుమార్

**కోట్‌పల్లి, నవంబరు 18, ప్రభాతవార్త;**
మన భవిష్యత్తు మన చేతుల్లోనే ఉందని రాష్ట్రంలో అధికార బీఆర్ఎస్ పార్టీకి ఓటుతో సమాధానం చెపుదామని వికారాబాద్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మాజీ మంత్రి ప్రసాద్‌కుమార్ అన్నారు, శనివారం మోమిన్‌పేట్, మండలంలోని రావులపల్లి, కొత్తకోల్కుంద, మేకవనంపల్లి, గ్రామాలల్లో అయన ఎన్నికల ప్రచారంలో భాగంగా అయన పర్యాటించారు. ఈసందర్భంగా అయన మాట్లాడుతూ. గత కాంగ్రెస్ పార్టీ హయంలోనే గ్రామాలు అభివృద్ధి చెందాయన్నారు. తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం గత పది సంవత్సరాల పాలనలో అభివృద్ధి కుంటపడి తాగుబోతు తెలంగాణగా తయ్యారైందన్నారు. వికారాబాద్‌లో అభివృద్ధి చేసిన అని ప్రగాల్భాలు పలికే ఎమ్మెల్యే ఎక్కడ అభివృద్ధి చేశారో చూపించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలను అమలు చేస్తామన్నారు. గతంలో కుడా ప్రతి గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు, పింఛన్లు, ఆరోగ్య శ్రీ ఇలా ఎన్నో సంక్షేమ పథకాలు తీసుకోచ్చిన ఘనత ఒక కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందన్నారు, ఈ ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ చేతి గుర్తుకు ఓటు వేసి భారీ మోజార్టీతో గెలిపించాలని అయన పేర్కోన్నారు, ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గోన్నారు.



మేకవనంపల్లి గ్రామంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మాజీ మంత్రి ప్రసాద్‌కుమార్,

# కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయం



దమ్మాయిగూడ మున్సిపాలిటీలో తనకు ఓటు వేయాలని కర పత్రాలను ఇస్తున్న మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి తోటకూర వజ్రేష్ యాదవ్

**కీసర, నవంబరు18, ప్రభాతవార్త ః**
రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు. శనివారం దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డులో భవానీనగర్ కాలనీలో, 6వ వార్డు రామలింగేశ్వర కాలనీలలో కార్నర్ మీటింగ్‌లలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తోటకూర వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ రాబోయేది ఇందిరమ్మ పాలన అని అందుకే కాంగ్రెస్ పార్టీలోకి వివిద పార్టీల నుండి వస్తున్నారని అన్నారు. ఈ రెండు వార్డులలో ఒక్కరికైనా డబుల్ బెడ్ రూం ఇండ్లు వచ్చాయా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో అర్హులైన వారికి డబుల్ బెడ్‌రూం ఇండ్లు రాలేదని అన్నారు. మేడ్చల్ నియోజకవర్గంలోనే అత్యధికంగా బిసి ఓటర్లు ఉన్నారని ఈ ప్రాంతంలో ఎంత మందికి బిసి బంధు ఇచ్చారని అన్నారు. ప్రధాన సమస్యగా ఉన్న మురికి కాలువ, సీసీ రోడ్లను వేయకుండా తీరా ఎన్నికల కోడ్ వచ్చాక కొబ్బరికాయ కొట్టారని అన్నారు. మంత్రి మల్లారెడ్డి భవానీనగర్ కాలనీలో ఒక ప్రభుత్వ పాఠశాలను మంజూరు చేయించలేక పోయారన్నారు. ఈ ఒక్క సారికి తనకు అవకాశమిస్తే కాలనీలలో ఉన్న సమస్యలను తీరుస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు నక్క ప్రభాకర్ గౌడ్, కౌన్సిలర్లు గోగుల సరిత, వెంకటేష్, మాజీ సర్పంచ్ రామారం వెంకటేష్ గౌడ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో కుటుంబ పాలన అంతమొందించాలి



ప్రచారం చేస్తున్న బీజేపీ అభ్యర్థి కె.ఎస్ రత్నం సతీమణి ప్రమీల

**షాబాద్, నవంబర్ 18, ప్రభాతవార్త :**
రాష్ట్రంలో కుటుంబ పాలన అంతమొందించాలంటే బీజేపీని గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ అభ్యర్థి కె.ఎస్ రత్నం సతీమణి ప్రమీల అన్నారు. శనివారం మండల పరిధిలోని కుమ్మరిగూడలో బీజేపీ అభ్యర్థి కె.ఎస్ రత్నంను భారీ మెజార్టీతో గెలిపించాలని ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.... రాష్ట్రంలో బీజేపీ అధికారంలో వస్తుందన్నారు. చేవెళ్ల అభివృద్ధిని విస్మరించిన బీఆర్ఎస్‌కు ఈ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని, చేవెళ్ల గడ్డపై కాషాయం జెండా ఎగరేద్దామన్నారు. కేంద్రంలో రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కార్ అధికారంలో ఉంటేనే గ్రామాలు త్వరితగతిన అభివృద్ధి చెందుతాయన్నారు. ఈకార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు కిరణ , అధికార ప్రతినిధి శ్రీధర్‌రెడ్డి, స్వచ్ఛభారత్ సెల్ రాష్ట్ర కన్వీనర్ రాము, నాయకులు రవీందర్‌రెడ్డి, మాణెయ్య, మహేందర్, నారాయణ, గోవర్ధన్, సత్యం, నరేందర్‌రెడ్డి, మహేష్, రవిగౌడ్ ఉన్నారు.

## చదువుపై ఆసక్తిగా ఉండాలి..!



సంచార గ్రంథాలయం వద్ద విద్యార్థులు, తల్లిదండ్రులు, పాఠశాల సిబ్బంది

**మాడ్గుల, నవంబర్ 18, ప్రభాతవార్త:** రోజురోజుకి మారుతున్న సమాజంలో భవిష్యత్తును తీర్చిదిద్దాలంటే పుస్తక పఠనం ముఖ్యమని రెయిన్‌బో పాఠశాల డైరెక్టర్ మంతాపురం జగన్ అన్నారు. విద్యార్థులకు పాఠ్య పుస్తకాలే కాక ఇతర సామాజిక, చరిత్ర, వికాస పుస్తకాలను ఎమ్మెస్కో బుక్స్ విజయవాడ వారి సహకారంతో పాఠశాలలో సంచార గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసి అనేక పుస్తకాలను పరిచయం చేశారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొని విజవంతం చేశారు. పాఠశాల ప్రెన్సిపాల్ శ్రీకుమార్, సిబ్బంది ఉన్నారు.

## ముదిరాజ్‌ల ఆత్మగౌరవాన్ని కాపాడుకోవాలి

**-ఓట్ల కోసం మభ్యపెట్టే నాయకులను నమ్మవద్దు**
**-ముదిరాజ్‌లకు ఒక్క బీఫామ్ ఇవ్వని పార్టీలను పక్కన పెట్టాలి**
**-ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షులు చొప్పరి శంకర్ ముదిరాజ్**



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షులు చొప్పరి శంకర్ ముదిరాజ్.

**తాండూరు, నవంబరు 18, ప్రభాతవార్త :**
ముదిరాజ్‌ల ఆత్మగౌరవాన్ని కాపాడుకోవాలని.. ఓట్ల కోసం మభ్యపెట్టే నాయకులను నమ్మవద్దని.. ముదిరాజ్ తల్లి రుణం తీర్చుకోవాలని తెలంగాణ మన ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షులు చొప్పరి శంకర్ ముదిరాజ్ అన్నారు. ముదిరాజ్‌లు రాజ్యాధికారంలో రావాలనే నినాదంతో శనివారం తాండూరులో ఏర్పాటు చేసిన సమావేశంలో మహాసభ రాష్ట్ర అధ్యక్షులు చొప్పరి శంకర్, ముదిరాజ్ చైతన్య వేధిక రాష్ట్ర అధ్యక్షులు శివకుమార్‌లు పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ముదిరాజ్‌లకు గౌరవం ఇవ్వని ఏ రాజకీయ పార్టీల అభ్యర్థుల తరపున ప్రచారం చేయవద్దని తెలిపారు. తాండూరు నియోజకవర్గంలో ముదిరాజ్‌లు అంతా ఏకమై ముదిరాజ్ బిడ్డను గెలిపించుకోవాలని అన్నారు. ముదిరాజ్ జాతిని అవమాన పరిచి ఒక్క బీఫామ్ కూడా ఇవ్వని పార్టీలకు ముదిరాజ్‌లు ఎందుకు ఓటు వేయాలని, అభ్యర్థుల తరపున ఎందుకు ప్రచారం చేయాలని ప్రశ్నించారు. ముదిరాజ్‌ల ఓట్లను దొరల కాళ్ల దగ్గర పెట్టటానికి ప్రచారం చేస్తున్న దొంగ నాయకులకు ఎదురుదాడి తప్పదని హెచ్చరించారు. ముదిరాజ్ తల్లి రుణం తీర్చుకునే సమయం ఆసన్నమైందని అన్నారు. జాతి ప్రయేజనాలే ముఖ్యమని, ముదిరాజ్ యువత రాజకీయ ప్రవేశం చేయాలని, మన వాటా మనం సాధించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు జగన్ ముదిరాజ్, నరేందర్, బాల్‌రాజ్, కనకయ్య, గోపాల్, సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్‌లో చేరిన మాజీ పిఎస్ఎస్ డైరెక్టర్



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న డాక్టర్ మెతుకు ఆనంద్

**ధారూర్ నవంబరు18, ప్రభాతవార్త :**
ధారూర్ మండల పరిధిలోని రుద్రారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ మాజీ పిఎసిఎస్ డైరెక్టర్ క్రిష్టఫర్ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ సమక్షంలో మండల సీనియర్ నాయకుడు వేణుగోపాల్ రెడ్డి, మండల రైతుబంధు అధ్యక్షుడు వెంకటయ్య ఆధ్వర్యంలో శనివారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రామచంద్రయ్య, ఉప సర్పంచ్ ఊలేందర్, సీనియర్ నాయకులు చంద్రయ్య, పోచయ్య, ప్రవీణ్ కుమార్, భరత్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా ప్రచారం




**యాచారం నవంబరు18, ప్రభాతవార్త :**
కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా నాయకులు కార్యకర్తలు పనిచేయాలని, యాచారం మండలం కాంగ్రెస్ పార్టీ కంచుకోట అని పార్టీ సీనియర్ నాయకులు గోరేటి గణేష్ పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని తమ్మలోనిగూడ గ్రామంలో విస్తృత స్థాయి ప్రచారం చేపట్టారు. తమ్మాలోనిగూడ గ్రామంలో రంగారెడ్డి గెలుపే లక్ష్యంగా ఇంటింటికి తిరిగి చేయి గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ప్రచారం చేశారు. బీఆర్ఎస్ చేపట్టిన ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలకు తెలియజేశారు.

## చేవెళ్ల గడ్డపై బిఆర్ఎస్ జెండా ఎగరడం ఖాయం

**శంకర్‌పల్లి, నవంబర్ 18 ప్రభాతవార్త:**
ఎవరు ఎన్ని కుట్రలు, కుతంత్రాలు పన్నినా చేవెళ్ల గడ్డపై బిఆర్ఎస్ జెండా ఎగరడం ఖాయమని బిఆర్ఎస్ నాయకుడు మహమ్మద్ ఎజాస్ ధీమా వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే కాలె యాదయ్య మూడోసారి గెలిచి హ్యాట్రిక్ సాధించడం ఖాయమని అన్నారు. ఆయన శనివారం నాడు మాట్లాడుతూ చేవెళ్ల గడ్డపై కాలె యాదయ్య గెలవడమే కాకుండా ముచ్చటగా మూడోసారి కెసిఆర్ ముఖ్యమంత్రి అవడం కూడా ఖాయమని అన్నారు. బిఆర్ఎస్ అభ్యర్థి కాలె యాదయ్యను భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని పేర్కొన్నారు. చేవెళ్ల నియోజకవర్గం ప్రజలు బిఆర్ఎస్‌కు ఓటు వేయాలని కంకణం కట్టుకున్నారని తెలిపారు. కారు గుర్తుకు ఓటేసి కాలె యాదయ్యను గెలిపించుకుందామని పిలుపునిచ్చారు.

## కాంగ్రెస్ ఇంటింటి ప్రచారం



గ్యారంటి పథకాలను వివరిస్తున్న నాయకులు


**మర్పల్లి నవంబర్ 18 ప్రభాతవార్త :**
శనివారం నాడు మర్పల్లి మండలంలోని దార్గులపల్లి, బిల్కల్ గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెల్లి 6 గ్యారెంటి పథకాలు వివరించారు. అబ్బదాలకోరు బిఆర్ఎస్ పార్టీని ఓడించాలని కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి మాజి మంత్రి గడ్డం ప్రసాద్ ను అదిక మేజరిటితో గేలిపించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రాంధలయ మాజి చైర్మన్ కోండల్‌రెడ్డి, మండలపార్టి అధ్యక్షులు రవి, నాయకులు సుభాష్ యాదవ్ పట్లూర్ ఎంపిటిసి స్వాప్నసురేష్, నాయకులు సురేష్ కుమార్, శేఖర్ యాదవ్, సజివరెడ్డి, పాండు నాయక్, ఆదరమ్‌సింగ్, నాయకులు, కార్యకర్తలు పాల్గోన్నారు.

## పాకలపాటి అర్పితకు కామర్స్‌లో డాక్టరేట్

**మొయినాబాద్, నవంబర్ 18 ప్రభాతవార్త:**
మొయినాబాద్ మండలం తోల్కట్ట ప్రాంతంలో ఉన్న వికారాబాద్ తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్సియల్ మహిళా డిగ్రీ కళాశాలలో కామర్స్ లెక్చరర్‌గా పని చేస్తున్న పాకలపాటి అర్పిత కామర్స్‌లో పిహెచ్‌డి పట్టా పొందారు. ఈ మేరకు ఉస్మానియా విశ్వవిద్యాలయం శనివారం నోటిఫికేషన్ జారీ చేసింది. ఖమ్మం జిల్లాకు చెందిన డా. అర్పిత గత 2019 నుంచి మహిళా డిగ్రీ కళాశాలలో కామర్స్ లెక్చరర్‌గా పని చేస్తున్నారు. ఆచార్య వి ఉషాకిరణ్ పర్యవేక్షణలో ఇంపాక్ట్ ఆఫ్ వర్క్ లైఫ్ బ్యాలన్స్ ఆన్ జాబ్ సాటిస్ఫాక్షన్ అండ్ జాబ్ ఫర్ఫామెన్స్, ఆన్ ఎవిడెన్స్ ఫ్రం తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్సియల్ డిగ్రీ కాలేజెస్ అనే అంశంపై ఉస్మానియా యూనివర్శిటీలో సిద్ధాంత గ్రంథం సమర్పించి పిహెచ్‌డి పట్టా పొందారు. డా. అర్పితను సహచర అధ్యాపకులు, కుటుంబ సభ్యులు డాక్టరేట్ పొందినందుకు హర్షం వ్యక్తం చేశారు. పిహెచ్‌డి అవకాశం కల్పించిన యూనివర్శిటీ వైస్ చాన్సలర్‌కు, రిజిస్ట్రార్‌కు, గైడ్ ఆచార్య వి ఉషాకిరణ్‌కు, సిద్ధాంత గ్రంథం సమర్పించడంలో తనను ప్రోత్సహించిన భర్త వినయ్‌కుమార్‌కు, కుటుంబ సభ్యులకు, కాలేజీ ప్రిన్సిపాల్ డా. కె. శ్రీనివాస్ శర్మకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

## ఓం స్వామియో..శరణం అయ్యప్ప

**-స్వామి నామస్మరణతో మారుమోగిన దేవాలయం**



అయ్యప్ప మాల ధరించిన స్వాములు

**నందిగామ నవంబరు18, ప్రభాతవార్త :** నందిగామ మండల కేంద్రంలో ఉన్న అయ్యప్ప దేవాలయంలో పవిత్ర కార్తీక మాసపు పవిత్ర దినాలను పురస్కరించుకోని శనివారం అయ్యప్ప భక్తులు మాలాధారణ కార్యక్రమం అత్యంత భక్తిశ్రద్ధలతో జరిగింది. గురుబ్రహ్మ శ్రీశ్రీశ్రీ సతీషన్ నాయర్ గురుస్వామి తనయుడు గిరిష్ నాయర్ ఆధ్వర్యంలో శనివారం మాలధారణ కార్యక్రమం చేపట్టడం జరిగింది. నందిగామ మండలంతో పాటు చుట్టు పక్కల గ్రామాల నుండి మాలధారణ చేయడం కోసం వచ్చిన భక్తులతో అయ్యప్ప స్వాములతో అయ్యప్ప నామస్మరణతో అద్యంతం ఆధ్యాత్మి వాతావరణం నెలకొంది. మాలదారణలో గురుస్వాములు కావలి ప్రభాకర్, జెట్టావత్ లక్ష్మణ్ నాయక్, స్వాములు వీరు, వినోద్ నాయక్‌లతో పాటు పలువురు స్వాములు ఉన్నారు.

## మీ సేవలకు శుభాభివందనాలు

**-మేకగూడ మాజీ ఎంపిటిసి బసప్ప**

**నందిగామ నవంబరు18, ప్రభాతవార్త :** అభివృద్ధే లక్ష్యంగా...సమాజ సేవే మార్గంగా సమాజ వికాసంలో ప్రత్యేకతను చాటుకుంటూ నాట్కో సంస్థలో పనిచేస్తూ ముప్పై సంవత్సరాలు పూర్తి చేసుకున్న నాట్కో ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ సదాశివరావు నన్నపనేనికి శనివారం నందిగామ మండలం మేకగూడ మాజీ ఎంపిటిసి, అడ్వకేటు మోముల బసప్ప ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఉమ్మడి మండలాల్లో మరెన్నో ఉన్నత పదవులు పొందాలని ఆయన ఆకాంక్షించారు. అలాగే నాట్కో సంస్థ వ్యవస్థాపకులు నన్నపనేని వెంకటయ్య చౌదరి, నాట్కో చైర్మన్ రాజీవ్ ననపనేనికి ప్రత్యేక అభినందనలు తెలిపారు.